ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 16.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 266 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

బైబై ఇండియా.. మళ్లీ వస్తా!! 8

ఇక ఇంటికే యూరియా

వ్యవసాయ శాఖ కొత్త యాప్ దాని ద్వారానే ఎరువుల పంపిణీ

- 20 నుండి ప్రయోగాత్మక అమలు
- యూరియా అధిక వినియోగంతో చేటు
- పంట అవశేషాలను కాల్చడంతో అనర్థాలు
- అధికారులు దానిని తగ్గించేందుకు కృషి చేయాలి
- ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలి
- వ్యవసాయ, ఉద్యాన అధికారులతో వ్యవసాయ మంత్రి తుమ్మల సమీక్ష

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 15: రైతులు యూరియా కోసం ఇక సమయాన్ని కేటాయించాల్సిన అవసరం లేదు. ఇంటి వద్ద నుంచే అవసరమైన యూరియాను ముందుగానే బుక్ చేసుకునే సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్ ను తీసుకురానున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రబీ ముందస్తు ప్రణాళిక మీద రాష్ట్ర, జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సోమవారం నాడు సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ నెల 20 నుండి మొబైల్ యాప్ ప్రయోగాత్మకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికంగా యూరియా వినియోగం వలన జరిగే అనర్థాలను రైతులకు వివరించాలని, పంట కోత తరువాత అవశేషాలను కాలిస్తే పర్యావరణ పరంగా, భూమి పరంగా జరిగే పర్యవసానాలు రైతులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన, కోపరేటివ్ అధికారులు అందరూ ఒక టీంలాగా కలిసి పనిచేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే, యూరియా బుకింగ్ కోసం రైతులు తమ పరిధిలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి సేవలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు.

పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి

అధికారులందరూ సంబంధిత వర్గాలకు యాప్ గురించి

...:: మిగతా 2లో

వృద్ధులు, వితంతవుల పింఛను పెంపుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందు కోసం లెక్కలు సిద్ధం చేసారు. ఈ హామీ అమలు చేయటం ద్వారా ఖజానాపై ఎంత భారం పడుతుంది? నెలకు ఎంత ఖర్చవుతుందన్న వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు సేకరించినట్లు సమాచారం. పేద మహిళలకు నెలకు రెండు వేల పథకం ఇంకా అమలు కాలేదు. సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ మద్దతుదారులు భారీ ఎత్తున గెలుపొందడంతో, త్వరలో పార్టీ గుర్తుపై నిర్వహించే ఎంపీటీసీ, మున్సిపల్ఎన్నికలలో ఓట్లు రాబట్టుకునేందుకు సీఎం స్కెచ్ వేశారని, దీంతో త్వరలోనే పెన్షన్ల పెంపుపై కీలక ప్రకటన ఉంటుందని కాంగ్రెస్వర్గాలు చెబుతున్నాయి.

త్వరలో పింఛన్ల పెంపు!

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

- దూకుడుగా ముందుకు వెళ్లే యత్నం
- ఆరు గ్యారంటీలు పూర్తి చేసేందుకు కృషి
- ప్రతిపక్షాల విమర్శలకు సర్కారు జవాబు
- మరో ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా
- రాష్ట్రంలో లెక్కలు తీస్తున్న అధికారులు
- దాదాపు 40 లక్షల మంది లబ్ధిదారులకు మేలు
- 'పరిషత్' 'బల్దియా' ఎన్నికలలోగానే నిర్ణయం
- పింఛనుదారుల ఓట్ల మీదనే కాంగ్రెస్ నజర్
- సర్పంచ్ ఎన్నికల గెలుపుతో సమరోత్సాహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 15: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక హామీని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందు కోసం అధికారులు గత కొన్ని రోజులుగా లెక్కలు సేకరిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని అమలు కోసం అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో మరో పదేండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందంటున్న సీఎం ఇచ్చిన హామీలలో ప్రధానమైనది పెన్షన్ల పెంపు. అధికారంలోకి వచ్చి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంది. దీంతో, పెండింగ్ హామీల అమలు పైన ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వస్తున్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో విజయం తరువాత సీఎం రేవంత్ మరింత దూకుడుగా కనిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా మరింత బలం పెంచుకోవాలని భావిస్తున్నారు. 2023 డిసెంబరు ఏడున ప్రమాణ స్వీకారం చేస్తే తొమ్మిదో తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలుకు తెచ్చారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తోంది.

...:: మిగతా 2లో

2029 ఎన్నికలలో పోటీ చేస్తాం

- సామాజిక తెలంగాణే నా ధ్యేయం
- యువత, మహిళలు రాజకీయాలకు రావాలి
- నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందాలి
- కాంగ్రెస్ సర్కార్ అన్ని రంగాలలో అట్టర్ ఫ్లాప్
- రేవంత్ పాలన పై ప్రజలలో తీవ్ర అసంతృప్తి
- నగర ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేవు
- ట్విట్వర్ (ఎక్స్) లో నెటిజన్లతో 'ఆస్క్ కవిత'

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 15: సామాజిక తెలంగాణే తన లక్ష్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి స్పష్టం చేశారు. 2029 ఎన్నికలలో తాము పోటీలో ఉంటామని తేల్చిచెప్పారు. సోమవారం 'ఆస్క్ కవిత హ్యాష్‌ట్యాగ్ పై ట్విట్టర్ (ఎక్స్)' లో పలువురు నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆమె వివరంగా సమాధానాలు ఇచ్చారు. తెలంగాణ విషయంలో తన విజన్, జాగృతి భవిష్యత్ కార్యాచరణ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు సహా పలు ప్రశ్నలను నెటిజన్లు సంధించారు. వాటికి కవిత ఇచ్చిన జవాబులు, ట్విట్టర్ (ఎక్స్) పాలిటిక్స్ విభాగం లో ఆస్క్ కవిత ఇంటరాక్షన్ నంబర్ వన్ గా నిలిచింది. యువత, మహిళలు వారికి నచ్చిన రంగాలలో అవకాశాలు పొందాలని, అందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. యువత, మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు జాగృతి కృషి చేస్తుందన్నారు. ప్రజలు సూచించిన పేరునే పార్టీకి పెడుతామన్నారు. తెలంగాణ సాధికారిత సాధించాలంటే మెరుగైన, నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందాలని అన్నారు. తెలంగాణ లో తల్లితండ్రులు పిల్లల చదువుకోసం ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండా ఉండే పరిస్థితి రావాలని అన్నారు. ఉద్యోగాలు, స్కిల్, భద్రత మూడింటిలో దేనికి ప్రాధాన్యం ఇస్తారని ప్రశ్నించగా, యువతకు ఉద్యోగాలు

...:: మిగతా 2లో



ఆస్ట్రేలియా బీచ్‌లో కాల్పులు

11 మంది మృతి.. 30 మందికి గాయాలు

- యూదుల ఉత్సవం లక్ష్యంగా కాల్పులు.
- పోలీసుల కాల్పుల్లో ఓ దుండగుడి హతం

సిడ్నీ డిసెంబర్ 15: ఆస్ట్రేలియాలో ఉగ్రవాదుల కాల్పులు కలకలం రేపాయి. యూదుల హనుక్కా ఉత్సవం లక్ష్యంగా ఈ దాడి జరిగింది. క్రిస్‌మస్ సందర్భంగా రద్దీగా ఉండే సిడ్నీలోని బోండీ బీచ్ మార్కెట్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ పోలీసు అధికారి సహా 11 మంది మరణించగా, ఇద్దరు పోలీసులు సహా 30 మంది గాయపడ్డారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. ఇది యూదుల లక్ష్యంగా జరిగిన దాడి అని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఉగ్ర దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల్లో ఒకడు నవీద్ అక్రమ్ అని పోలీసులు గుర్తించారు. ఇతను నైరుతి సిడ్నీలోని బోన్నీరిగ్‌లో నివసిస్తున్నట్లు తెలిపారు. కొన్ని నెలలుగా ప్రణాళిక రచించి, ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాలల ఆట స్థలం వద్ద ఈ దాడి జరిగింది. పోలీసుల కాల్పుల్లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. మరొక దుండగుడు తీవ్రంగా గాయపడ్డాడు.

పడిపోతున్న టెంపరేచర్

- గజ గజా వణుకుతున్న జనం
- దేశమంతా దాదాపు ఇదే పరిస్థితి
- తెలంగాణలో మరో 3 రోజులు పదిలం
- ఉత్తరాది నుంచి వీస్తున్న అతి శీతల గాలులు
- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ శాఖ

...:: 2లో



నేను తెలంగాణవాసిని

- నెల్లూరులో పుట్టాను, ఇక్కడే పెరిగాను
- భావి తరాల కోసమే బాలు విగ్రహం
- స్వర సార్వభౌమత్వానికి ఎస్పీ నిలువెత్తు నిదర్శనం
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- పాటకు ఎల్లలు లేవని నిరూపించారు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 15 : నగరంలోని రవీంద్ర భారతి ప్రాంగణంలో 'ది మ్యూజిక్ గ్రూప్ హైదరాబాద్' ఆధ్వర్యంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, తాను నెల్లూరుకు చెందిన వాడినని, నేడు తెలంగాణవాసినని పేర్కొన్నారు. నెల్లూరులో పుట్టిన నేను హైదరాబాద్‌లో ఉంటూ రాజకీయంగా ఎదిగానని, ప్రస్తుతం హైదరాబాద్ లో ఉంటూ తెలంగాణ వాడిగా కొనసాగుతున్నానని చెప్పారు. భావితరాల కోసమే రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతి ఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. బాల సుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటు మన తెలుగు ప్రజలందరికీ గౌరవం అని భావిస్తున్నానని బండారు దత్తాత్రేయ తెలిపారు.

సినీ సంగీత చరిత్రపై చెరగని సంతకం

భారతీయ సినీ సంగీత చరిత్రపై చెరగని సంతకం 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం' అని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 14 భారతీయ భాషలలో 40 వేలకు పైగా పాటలు పాడి, పాటకు ఎల్లలు లేవని నిరూపించిన స్వర మాంత్రికుడని కొనియాడారు. తరాలు మారినా, ఆయన పాట నిత్యనూతనంగా ప్రతీ తెలుగు హృదయాన్ని అది తట్టి లేపుతూనే ఉంటుందని అన్నారు. గాయకుడిగా మాత్రమే కాదు, నటుడిగా,

...:: మిగతా 2లో

జోర్దాన్‌లో ప్రధాని మోడీకి ఘన స్వాగతం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆయన ముందుగా జోర్డాన్ లోని అమ్మాన్ కు చేరుకున్నారు. జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ స్వయంగా ప్రధాని మోదీకి స్వాగతం పలికి ప్రత్యేక గౌరవం కల్పించారు.

7

పహల్గాం దాడిలో పాక్ ప్రమేయం వాస్తవం

కశ్మీర్‌లోని బైసరన్ లోయలో ఎనిమిది నెలల క్రితం జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందనే వార్త నిజమైంది. 26 మంది పర్యటకులను బలిగొన్న దాడికి లష్కరే తోయిబా అగ్రనేత సూత్రధారి అని జాతీయ దర్యాప్తు సంస్థ తెలిపింది.

7

ఇది తమిళనాడు.. మీ పప్పులుడకవ్

బీహార్ విజయవంతమయ్యామని, ఇక తమిళనాడు రాష్ట్రమే తమ టార్గెట్ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ స్పందించారు. ఇది తమిళనాడు రాష్ట్రమని, ఇక్కడ అహంకార బీజేపీ ఎప్పటికీ గెలవలేదని వ్యాఖ్యానించారు.

7

లోయలో పడ్డ బస్సు.. 17 మంది మృతి

కొలంబియాలో స్కూల్ బస్సు అదుపుతప్పి లోయలోపడింది. ఈ ఘటనలో 17 మంది విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు.

7

రాష్ట్రీయం

కొనసాగుతున్న ప్రభాకర్ రావు కస్టడీ విచారణ

- నోరు మెదపని ఎస్ఐబీ మాజీ చీఫ్
- ఐక్లౌడ్, జీ మెయిల్ ఖాతాలు కేంద్రంగా విచారణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టడీ విచారణ కొనసాగుతోంది. నాలుగవ రోజు ప్రభాకర్ రావు కస్టడీ విచారణ చేశారు. ఇప్పటికే మూడు రోజుల పాటు ఎస్ఐబీ మాజీ చీఫ్‌ను పలు అంశాలపై సిట్ విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను ముందు ఉంచి మరీ ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. అయితే అనేక ప్రశ్నలకు ఆయన నోరు మెదపనట్లు తెలుస్తోంది. ప్రభాకర్‌రావు వినియోగించిన ఐక్లౌడ్, జీ మెయిల్ ఖాతాల కేంద్రంగా విచారణ కొనసాగుతోంది. ఐక్లౌడ్, జీ మెయిల్ అకౌంట్ ఖాతాల్లోని సమాచారంపై సిట్ ప్రధానంగా దృష్టిసారించింది. ప్రభాకర్ రావు ఎరేజ్ చేసిన డేటా కోసం యాపిల్, జీ మెయిల్ సంస్థలకు సిట్ ఇప్పటికే లేఖలు రాసింది. వారిచ్చే సమాచారంతో కీలక విషయాలు వెలుగు చూస్తాయని సిట్ భావిస్తోంది. అమెరికాలో ఉన్న డివైస్‌లో ఐ క్లౌడ్ ఖాతాతో ప్రభాకర్ రావు లాగిన్ అయినట్లు సిట్ గుర్తించింది. అయితే ఆ డివైస్‌ను అమెరికాలోనే వదిలేసి వచ్చారు ప్రభాకర్ రావు. ఈ క్రమంలో అసలు ఆ ఖాతాలో ఎందుకు లాగిన్ అయ్యారు అన్న కోణంలో సిట్ విచారణ సాగుతోంది.

ఆయుర్వేద కళాశాలలో అనంతాచార్యులు చిత్రపటం ఏర్పాటు

- ప్రముఖ వైద్యులు డాక్టర్‌ధనుంజయ

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: భాగ్యనగరంలో ఆయుర్వేద కళాశాల స్థాపనకు ప్రధాన చోదకశక్తి అయిన శ్రీమాన్ ముదుంబై అనంతాచార్యులు చిత్రపటం ఎట్టకేలకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారని ప్రముఖ వైద్యులు డా.ధనుంజయ తెలిపారు. దాదాపు తొమ్మిదేళ్లకుపైగా నెరవేరకుండా వున్న శ్రీమాన్ ఆచార్యుల కుటుంబ సభ్యుల కలనేడు నెరవేరిందని ఆయన అన్నారు. చార్మినార్ ప్రాంతం నుండి సనత్ నగర్ ప్రాంతానికి కళాశాలను తరలించినప్పటి నుండి వారు ప్రయత్నాలు చేస్తున్నా కళాశాలలో ఆనంతాచార్యుల చిత్రపటం పెట్టలేదని, ఇటీవలే ఆయుష్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్ బాబు శ్రీరంగగిరికి వచ్చిన సందర్భంలో తనపాటు, కుటుంబసభ్యులు చేసిన వినతికి ఆయన తక్షణం స్పందించారని డా. ధనుంజయ తెలిపారు. ఈ మేరకు సోమవారం ముదుంబై అనంతాచార్యులు చిత్రపటం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డా. మమత కస్తూరి ఆధ్వర్యంలో ఏర్పాటైన చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని డా.ధనుంజయ అన్నారు. ఈ సందర్భంగా రేపటి నుండి ఆరంభం కానున్న తిరుప్పావై వ్రతం తాలూకు ఫలితం మాకు ఆదిలోనే దక్కినట్టు భావిస్తున్నామని ఆచార్యులవారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి

- సోమార్ పేట సంఘటన అత్యంత అమానుషం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ఆ పార్టీ నాయకుల గూండాగిరి రోజురోజుకూ శ్రుతి మించుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అమానుష ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు తెగబడటం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాల తర్వాత ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలో బీఆర్ఎస్ తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బిట్ల బాలరాజు, ఫలితాల తర్వాత తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ఇంటి ముందు కూర్చుని ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికలలో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి సాయిబాబా ఒక ట్రాక్టర్‌తో అక్కడకు వచ్చి బీభత్సం సృష్టించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. నన్ను ఎవరూ ఏం చేయలేరు' అంటూ విర్రవీగుతూ అటు నిల్చున్న వారిపైకి ట్రాక్టర్ ఎక్కించి ఢీకొట్టారు. ఈ దాడిలో బీఆర్ఎస్ అభ్యర్థి బాలరాజుతో పాటు ఆయన అనుచరులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు కేటీఆర్, ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. అనంతరం కామారెడ్డి ఎస్పీకి ఫోన్ చేశారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు చర్యలు

- లీజు భూములు, షాపుల రెగ్యులరైజేషన్ కు అవకాశం
- వంద గజాల్లోపు స్థలాల విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- హౌసింగ్ బోర్డు భూములపై అధికారులతో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15:- హౌసింగ్ బోర్డు భూములు పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు భూములపై సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు భూముల లీజు, అగ్రిమెంట్లు, కోర్టు కేసులు, అద్దెలు తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఒకవైపు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే మరో వైపు లీజు, కమర్షియల్, అద్దెలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకు ఇవ్వడం జరిగిందని, ఇందులో ప్రధానంగా ఇనిస్ట్యూషన్స్, రెసిడెన్షియల్, కమర్షియల్, స్కూల్స్, టెంపుల్స్ తదితరాలు ఉన్నాయని, ఏడు స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు, అలాగే అద్దె బకాయిలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. లీజు అగ్రిమెంట్ పునరుద్ధరణ చేసుకోని సంస్థలకు రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో హౌసింగ్ బోర్డుకు వివిధ ప్రాంతాల్లో 301 కమర్షియల్ షాపులు ఉండగా 2007లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు 14 మంది షాపులు కొనుగోలు చేయగా మిగిలిన 287 షాపులకు గాను 62 షాపులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి షాపు యజమాని ప్రతి ఏడాది 10శాతం అద్దెను పెంచుతూ షాపును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని, అయితే ఈ నిబంధన అమలు కాకపోవడంతో షాపు యజమానుల నుంచి హౌసింగ్ బోర్డుకు కోట్లాది రూపాయిలు రావలసి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్నవారు ఆ షాపులను కొనుగోలు చేయడానికి ముందుకువస్తే మార్కెట్ ధర ప్రకారం విక్రయించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. అలాగే షాపు నిర్వహణకు అనువుగా లేకపోతే ఆ స్థలాన్ని వేలంలో విక్రయించాలని సూచించారు. కోర్టు కేసులలో ఉన్న భూములు హౌసింగ్ బోర్డుకు చెందేలా పటిష్టమైన వాదన వినిపించేలా ప్రత్యేకంగా అడ్వకేట్‌ను నియమించుకోవాలని సూచించారు. హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇండ్లకు పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాలను ఆ ఇంటి యజమానికి ఆసక్తి ఉంటే విక్రయించాలని సూచించారు. వీటన్నింటిపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు ఎండీ విపి గౌతమ్, సీఈ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక ఇంటికే యూరియా

మొదటిపేజీ తరువాయి

పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, యాప్‌ను అమలలోకి తీసుకురావాలని ఆదేశించారు. యూరియా పక్కదారి పట్టకుండా, పంట పండించే రైతులకు మాత్రమే యూరియా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్ ని రైతుల ముందకు తీసుకురాబోతున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. దేశంలోనే యూరియాని అధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటని, రైతులకు యూరియా వాడకం వలన కలిగే నష్టాలను వివరించి, వినియోగం తగ్గించాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అధికారులు విస్తృత పర్యటనలు చేసి, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని మంత్రి మరోసారి గుర్తుచేశారు. ఈ దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.

యాప్ ప్రత్యేకతలు:
రైతులు, సిటిజన్, డిపార్ట్ మెంట్, డీలర్ల కోసం వేర్వేరు లాగిన్లు, మొబైల్ నంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ అయ్యే అవకాశం. లాగిన్ అవ్వగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని బస్తాల యూరియా అందుబాటులో ఉందో కనిపిస్తుంది. రైతులు తమ జిల్లాను ఎంపిక చేయగానే ఆ జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా బ్యాగులు కనిపిస్తాయి. తరువాత సీజన్ ను, వారి పాస్ బుక్ నెంబర్, వారు ఎన్ని ఎకరాలలో పంట వేస్తున్నారో, ఏఏ పంటను వేస్తున్నారో ఎంటర్ చేయాలి. వారు సాగు చేసే ఎకరాలను బట్టి వారికి అవసరమయ్యే యూరియా బ్యాగులు యాప్ లో కనిపిస్తాయి. సాగు చేసే విస్తీర్ణాన్ని బట్టి వారికి అవసరమయ్యే యూరియా బస్తాలను 15 రోజుల వ్యవధితో 1 నుండి 4 దశలలో అందచేసేలా వివరాలు కనిపిస్తాయి. పాస్ బుక్ లేని రైతులు వారి పట్టా పాస్ బుక్ దగ్గర ఆధార్ సెలెక్ట్ చేసుకొని, ఆధార్ నంబర్ ఎంటర్ చేసి, ఓటీపీ కన్ఫర్మేషన్ తరువాత వారు వివరాలను నింపాలి. కౌలు రైతులు కూడా వారి పేరు, తండ్రి పేరు, ఆధార్ నెంబర్ ఎంటర్ చేసి, ఓటీపీ ఎంట్రీ తరువాత భూ యజమాని పట్టా పాస్ బుక్ నెంబర్ ఎంటర్ చేస్తే, యజమాని మొబైల్ నంబర్ తో ఓటీపీ వ్యాలిడేషన్ తరువాత కౌలు రైతులు కూడా తమ వివరాలు ఎంటర్ చేసేలా ఈ యాప్ లో అవకాశం కల్పించారు. ఇక, డీలర్లు వారి మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి, వారు రోజువారిగా వారికి వచ్చిన స్టాక్, అమ్మకం వివరాలను నింపాల్సి ఉంటుంది.

త్వరలో పింఛన్ల పెంపు!

మొదటిపేజీ తరువాయి

రెండు వందల యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు కూడా అమలు చేసింది. రైతులకు రెండు లక్షల వరకూ రైతు రుణ మాఫీ అమలు చేసింది. మహాలక్ష్మి పథకం కింద ఐదు వందలకే వంట గ్యాస్ సిలిండర్ పథకం కొనసాగుతోంది. ఇక వెనుకబడిన వరి రైతులకు ఐదు వందల బోనస్ ను అందచేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి. యువ వికాసం పథకం కింద ఐదు లక్షల విద్యాభరోసా కార్డును కూడా అమలు చేస్తున్నారు. వృద్ధులు, వితంతవుల పింఛను పెంపుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందు కోసం లెక్కలు సిద్ధం చేసారు. ఈ హామీ అమలు చేయటం ద్వారా ఖజానాపై ఎంత భారం పడుతుంది? నెలకు ఎంత ఖర్చవుతుందన్న వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు సేకరించినట్లు సమాచారం. పేద మహిళలకు నెలకు రెండు వేల పథకం ఇంకా అమలు కాలేదు.

4 లక్షల మందికి లబ్ధి
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు వృద్ధులు, వితంతువులకు నెలకు నాలుగు వేల రూపాయలు ఇస్తున్నారు. పెన్షన్ల పెంపుతో వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో గంపగుత్తగా ఓట్లు కొల్లగొట్టేందుకు త్వరలోనే పెన్షన్ల పెంపుపై సీఎం కీలక నిర్ణయం వెల్లడించనున్నట్లు సమాచారం. అధికారుల లెక్కల ప్రకారం తెలంగాణలో వృద్ధులు 12,30,000, దివ్యాంగులు ఐదు లక్షలు, వితంతువులు దాదాపు 20 లక్షలు, నేత కార్మికులు 36,872, కల్లు గీత కార్మికులు 62,164, బీడి కార్మికులు 4,07,374, ఒంటరి మహిళలు 1,33,936, హెచ్ఐవీ రోగులు 32,718, కళాకారులు 30 వేల మందికి పైగానే ఉన్నారు. వీరందరికీ పింఛను పెంచాల్సి ఉంది. అంటే, దాదాపు 40 లక్షల మందికి పైగా పింఛను మొత్తాన్ని పెంచాల్సి ఉంది. ప్రస్తుతం వీరికి 2,116 పింఛను ఇస్తున్నారు. దీంతో, ఆర్థికంగా సమస్యలు ఈ పథకం కోసం నిధుల సమీకరణ పైన కసరత్తు జరుగుతోంది. సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ మద్దతుదారులు భారీ ఎత్తున గెలుపొందడంతో, త్వరలో పార్టీ గుర్తుపై నిర్వహించే ఎంపీటీసీ, మున్సిపల్‌ఎన్నికలలో ఓట్లు రాబట్టుకునేందుకు సీఎం స్కెచ్ వేశారని, దీంతో త్వరలోనే పెన్షన్ల పెంపుపై కీలక ప్రకటన ఉంటుందని కాంగ్రెస్‌వర్గాలు చెబుతున్నాయి.

“



ప్రజలను మభ్య పెట్టేందుకు మెడికల్ కాలేజీల అంశాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారు. మెరుగైన చదువు, సేవలు కావాలంటే పీపీపీనే సరైన విధానమని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది. పీపీపీ విధానంలోనే రహదారులు, ఎయిర్ పోర్టులు వంటి సదుపాయాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. మరోవైపు 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం.
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

పడిపోతున్న టెంపరేచర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 15 : తెలుగు రాష్ట్రాలను చలిపులి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవటంతో తెలంగాణలో గత పదేండ్ల వాతావరణ రికార్డులు బద్దలవుతున్నాయి. 28 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు కావటంతోబాటు చలిగాలుల ధాటికి జనం నానా అవస్థలు పడుతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల వల్ల ఈ పరిస్థితి నెలకొందని వాతావరణ శాఖ చెబుతోంది. రాబోయే మూడు రోజుల పాటు చలి ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. అతిశీతల గాలులతోపాటు పొగమంచు పెరిగే అవకాశం ఉందంటూ హెచ్చరికలు జారీ చేసింది. ఇంత చలి ఎప్పుడూ చూడలేదంటున్నారు హైదరాబాదీలు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించక తప్పడం లేదంటున్నారు. మూడు రోజులుగా చలి ఎక్కువైందని చెబుతున్నారు. ఇక తెలంగాణ జిల్లాలలో చాలా చోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్‌లో 10.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పటాన్‌చెరులో అత్యల్పంగా 5.4 డిగ్రీల టెంపరేచర్ నమోదయింది. ఆదిలాబాద్ - 7.2, మెదక్ - 7.2, హన్మకొండలో 8.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక రామగుండంలో ఉష్ణోగ్రత 10.9 డిగ్రీలకు పడిపోయింది. నిజామాబాద్‌లో 11.2, ఖమ్మం - 12.4, మహబూబ్ నగర్‌లో 13.5 డిగ్రీల టెంపరేచర్ రికార్డయింది. ఇక నల్గొండలో 14 డిగ్రీలు, భద్రాచలంలో 14.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

ఏపీ, ఉత్తరాదిలో కూడా
అటు ఏపీని కూడా చలి వణికిస్తోంది. మరీ ముఖ్యంగా మన్యం జిల్లాలను చలి గజగజలాడిస్తోంది. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతుండడంతో బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. పాడేరు, అరకులో 4 డిగ్రీల టెంపరేచర్ నమోదవ్వడంతో వాటర్ గడ్డ కడుతోంది. వ్యవసాయ భూములలోని నీరు కూడా గడ్డ కట్టడంతో రైతులెవ్వరూ ఉదయాన్నే పొలాల వైపు వెళ్లట్లేదు. ఉత్తరాది రాష్ట్రాలపై కూడా చలి పంజా విసురుతోంది. పలుచోట్ల కనిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలు ప్రాంతాలలోనూ దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఢిల్లీలో కనిష్టంగా 7.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, గరిష్టంగా 16 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయ్యింది. జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ రాష్ట్రాలలో హిమపాతం సంభవించింది. పుల్వామా, షోపియాన్‌లో మైనస్ 5.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీనగర్, కుప్వారాలో మైనస్ 3.6 డిగ్రీలు, కాజిగుండ్‌లో 2.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉత్తరాఖండ్‌కు కోల్డ్ వేవ్ అలర్ట్ జారీ చేశారు. యూపీ, ఢిల్లీ, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతున్నాయి.

2029 ఎన్నికలలో పోటీ చేస్తాం

మొదటిపేజీ తరువాయి

కల్పించటమే తన ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. ఉద్యోగాలతో పాటు వారికి భద్రత కూడా కల్పించాలన్నారు. సామాజిక న్యాయం కోసం జాగృతి పోరాటం కొనసాగుతుందన్నారు. క్రమంగా జాగృతిని చాలా బలంగా తయారు చేస్తామని చెప్పారు. త్వరలోనే జాగృతి మెంబర్ షిప్ డ్రైవ్ కూడా ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా మేము వేసిన కమిటీల్లో ఇప్పటికే అన్ని వర్గాలకు అవకాశం ఇచ్చామని చెప్పారు.

కాంగ్రెస్ పాలన పై తీవ్ర అసంతృప్తి
రేవంత్ రెడ్డి పరిపాలన గురించి పలువురు నెటిజన్లు కవితను ప్రశ్నలు అడిగారు. రేవంత్ పాలన ఎలా ఉందన్న ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. హామీలను నెరవేర్చటంలో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించకపోవటంతో అటు లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఆడపిల్లల చదువుకు మరణశాసనంగా మారిందన్నారు. రైతుల ఆత్మహత్యలు చాలా బాధకరమని చెప్పారు. కాంగ్రెస్ వచ్చాక వరుసగా రైతుల ఆత్మహత్యలు కొనసాగటం బాధకరమన్నారు. ప్రభుత్వం చేతగాని, నిర్లక్ష్య వైఖరిని నిదర్శనమని చెప్పారు. ఇక ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూములలో ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేయటంపై మండిపడ్డారు. తర్వలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ వచ్చాక సింగరేణి సంస్థను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్‌తో కలిసి సింగరేణి కోసం ప్రభుత్వం మీద పోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్ లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవటంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెస్ట్ సిటీ మీద పెట్టిన శ్రద్ధ, ఈస్ట్ సిటీని అభివృద్ధి చేయటంలో పెట్టలేదన్నారు.

చిరంజీవి అభిమానిని: కవిత వ్యక్తిగత అభిరుచులకు సంబంధించి పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. రామ్ చరణ్ గురించి ఒక్క మాటలో చెప్పాలని అడగగా, చాలా హంబుల్‌గా ఉండే వ్యక్తి. మంచి డ్యాన్సర్ అన్నారు. ఐతే తాను చిరంజీవి అభిమానిని అని...చిరంజీవి తర్వాతే రామ్ చరణ్ అన్నారు. చిన్నప్పుడు ఎర్రమంజిల్ లో గడిపిన క్షణాలు తనకు చాలా సంతోషం కలిగించాయని అన్నారు. అయితే రాజకీయాలు కాకుండా ఏదైనా బిజినెస్ పై దృష్టి పెట్టాలంటూ ఓ నెటిజన్ సూచించగా, అందుకు కవిత కూల్ గా అన్సర్ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి చాలా నెగిటివ్ ఉంటుందని దాన్ని పట్టించుకోకుండా మంచిగా ఆలోచించాలని సూచించారు. ఆస్క్ కవిత ఇంటరాక్షన్ గంటన్నర పాటు సాగింది. వందలాది మంది ట్విట్టర్ (ఎక్స్) లో ప్రశ్నలు అడిగారు .. కవిత వారికి సమాధానాలు ఇచ్చారు. సోమవారం ట్విట్టర్ (ఎక్స్) పాలిటిక్స్ విభాగంలో ఈ ఇంటరాక్షన్ నంబర్ వన్ గా నిలిచింది.

నేను తెలంగాణవాసిని

మొదటిపేజీ తరువాయి

సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా అలరించారన్నారు. ఈ రోజు మనం ప్రారంభించుకున్నది కేవలం విగ్రహం మాత్రమే కాదని, అది సంగీతానికి, నిబద్ధతకు, వినయానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, డా.కేఐ వరప్రసాద రెడ్డి, ఎస్పీ చరణ్, శుభలేఖ సుధాకర్ తదితరులు ప్రసంగించారు. రవీంద్ర భారతిలో ఎస్పీ బాలు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణవాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాలలో భారీగా పోలీసులను మోహరించారు.

జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపుపై హైకోర్టులో పిటిషన్

- జీహెచ్ఎంసీ వద్ద బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: హైదరాబాద్ మహానగర కార్పొరేషన్లో డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ వినయ్ కుమార్ అనే వ్యక్తి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ఈ పిటిషన్ పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. డివిజన్ల పెంపు పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరిన పిటిషనర్ తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాంనగర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోలేదని పిటిషనర్ అన్నారు. విచారణను హైకోర్టు నేటికి వాయిదా వేసింది.

జీహెచ్ఎంసీ వద్ద బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

కావాడిగూడలో ఉన్న దోమల గూడ ప్రత్యేక డివిజన్ చేయాలంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ శ్రేణులు జీహెచ్ఎంసీ వద్ద ఆందోళన చేశారు. 80 శాతం జనాభా కలిగిన డివిజన్ పేరు తీసేయడం సరైన పద్ధతి కాదని దోమలగూడ డివిజన్ నేతలు తెలిపారు. ఇప్పటికైనా తమ డివిజన్ పేరు మార్చాలని కోరారు. ఆందోళనకు దిగిన అఖిలపక్ష నేతలను పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నేతలు సాయి కృష్ణ, బీజేపీ ఓబీసీ మోర్చా నేత శ్రీనివాస్ యాదవ్ నిరసనలో పాల్గొని దోమలగూడ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మమ్మల్ని అడగరా?

జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన శాస్త్రీయంగా జరపాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. డివిజన్ల పురనర్విభజనలో తమ అభిప్రాయాలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతిపత్రం ఇచ్చామన్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ ఏ ప్రాతిపదికన ప్రకారం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న ఈ తరుణంలో జీహెచ్ఎంసీ పెరగడం బాగుంది. అందరి అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అభ్యంతరాలు తెలుసుకోకపోవడం అవేదనగా ఉంది. అంతే తప్ప జీహెచ్ఎంసీ పెరుగుతుండటంలో అభ్యతరం లేదు.' అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు.

తొందరపాటు ఎందుకు?

తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ గద్వాల విజయలక్ష్మికి బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం ఇచ్చారు. డివిజన్ల పునర్విభజనలోని తప్పిదాలను సరిచేయాలని ఆ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ల విభజన గందరగోళంగా చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనలో తొందరపాటు ఎందుకని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా డివిజన్లు విభజించడం తప్పని పేర్కొన్నారు. కాగా, జీహెచ్ఎంసీ పరిధిలోని బీజేపీ కార్పొరేటర్లతో రామచందర్‌రావు సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై కార్పొరేటర్లతో చర్చించారు. కౌన్సిల్ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు వ్యవహరించాల్సిన వ్యూహంపై చర్చలు జరిపారు.

ఓడిన అభ్యర్థి కుటుంబంపై దాడి

- ట్రాక్టర్ తో ఢీకొట్టిన గెలిచిన అభ్యర్థి
- నలుగురు తీవ్రంగా గాయాలు

కామారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 15 : ఓడిన అభ్యర్థి కుటుంబాన్ని గెలిచిన అభ్యర్థి బంధువులు ట్రాక్టర్ తో ఢీకొట్టారు. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్ పేటలో ఈ సంఘటన జరిగింది. తనకు వ్యతిరేకంగా పోటీ చేసిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజును ట్రాక్టర్ తో కాంగ్రెస్ అభ్యర్థి పాపయ్య సోదరుడు ఢీకొట్టాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, తనను ఎవరు ఏం చేయలేరు అని చెప్పి మరి దాడి చేశాడు. తన అన్న కుమారుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా అండతోనే ఈ దారుణానికి బాబాయి పాపయ్య సోదరుడు పాల్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఇంటి ముందు కూర్చున్న బీఆర్ఎస్ అభ్యర్థిని, అతని అనుచరులను, కుటుంబ సభ్యులను ట్రాక్టర్ తో ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇందుకు నిరసనగా రెండు గంటలుగా రాస్తారోకో కొనసాగింది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సర్పంచ్ ఎన్నికలలో గెలిచిన కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు.

ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం

- సీఎం పనితీరుకు పంచాయతీ ఫలితాలే నిదర్శనం
- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చిన్నంబావిలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ధ్వజమెత్తారు. సీఎం పనితీరుకు, ప్రభుత్వంపై ప్రజల్లో గట్టి నమ్మకం, విశ్వాసం ఏర్పడిందనడానికి ఈ పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శమని పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన మొదటి, రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుందని అన్నారు. 50 చోట్ల (3 స్వతంత్రులను కలిపి) అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలుపొందగా, 28 స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారని చెప్పారు.

'టిమ్స్' పనుల్లో వేగం పెంచాలి

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: 'టిమ్స్' పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్ ఆదేశించారు. వికాస్ రాజ్ సోమవారం అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ అధికారులకు, నిర్మాణ సంస్థకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కృత నిశ్చయంతో ఉందని వికాస్ రాజ్ అన్నారు. అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ సుమారు 1196 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని, ముఖ్యమంత్రి, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి రెగ్యులర్ గా నిర్మాణ పురోగతిపై మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. టిమ్స్ అల్వాల్ పనులు 70% శాతం పూర్తయ్యాయని చెప్పారు. 2026 మార్చి చివరి నాటికి అన్ని రకాల పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధం చేయాలని వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యకరమంలో ఆర్ అండ్ బీ సీఈలు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, పలువురు ఈఈ, డీఈలు ఫీల్డ్ ఇంజనీర్లు, డీఈసీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ హైడ్రాతోనే సాధ్యం

- ఖాళీ స్థలాల్లో పార్కుల అభివృద్ధికి విన్నపాలు
- హైడ్రా ప్రజావాణికి 46 ఫిర్యాదులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 15: చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడి, పర్యావరణానికి ఊతమివ్వడం హైడ్రాతోనే సాధ్యమని పలువురు పేర్కొన్నారు. చెరువులు, నాలాలను పరిరక్షించి అనుసంధానం చేయాలని అప్పుడే వరదలు లేని నగరం చూడగలమన్నారు. ఈ క్రమంలో చెరువులను పరిరక్షిస్తున్న హైడ్రా.. పార్కులను కూడా చేపట్టాలని పలువురు కోరారు. లేఔట్లలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి ప్రాణవాయువును అందించాలని పలువురు హైడ్రా ప్రజావాణిలో కోరారు. నిజాంపేటలోని తుర్క చెరువు కింద ఉన్న ప్రభుత్వ స్థలాలకు కంచెవేసి పార్కులుగా తీర్చిదిద్దాలని కోరారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం చిన్న చెర్లపల్లిలోని వెంకటరెడ్డి కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని వెంటనే హైడ్రా జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

ఆధ్యాత్మికత ద్వారా విశ్వ చైతన్యం

- ఏపీ సీఎం చంద్రబాబు
- రంగారెడ్డి జిల్లా చేగూరులో కన్హా శాంతివనంలో పర్యటన

ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్ 15: ఆధ్యాత్మికత ద్వారానే విశ్వ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతి వన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కన్హా శాంతి వనం నిర్వాహకులు, శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీతో సమావేశమయ్యారు. శాంతివనంలో జరుగుతోన్న శాస్త్రీయ, వృక్షశాస్త్ర పరిశోధనల గురించి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శాంతివనంలో చేపడుతున్న జీవ వైవిధ్యం, పర్యావరణ కార్యక్రమాలను వీక్షిస్తూ సీఎం చంద్రబాబు రెయిన్‌ఫారెస్ట్‌ను సందర్శించారు. రెయిన్ ఫారెస్ట్ రూపకల్పన, దానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సీఎంకు దాజీ వివరించారు. అలాగే ధ్యాన మందిరం వెలుపల ఉన్న వర్షపు నీటి సంరక్షణ ప్రాంతమైన బాబూజీ వనాన్ని సీఎం సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అకాడమీని, ప్రపంచ స్థాయి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కన్హా శాంతి వనంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే వాతావరణం ఉందన్నారు. విద్యా రంగంలో కొత్త ప్రమాణాలు పాటిస్తూ, హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. ఏపీ ముఖ్యమంత్రి శాంతివనాన్ని సందర్శించడం సంతోషాన్నిస్తోందని శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీ అన్నారు. అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సేవలను అందిస్తున్నామని దాజీ తెలిపారు.

తెలంగాణకు ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు

- అందజేసిన రాష్ట్రపతి ముర్ము

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు 2025 వరించింది. రాష్ట్రాల పనితీరులో ద్వితీయ బహుమతి లభించింది. ఎనర్జీ కన్జర్వేషన్‌కు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) తీసుకుంటున్న చర్యలకుగాను ఈ అవార్డు దక్కింది. ఆదివారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, రెడ్కో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీజీ రెడ్కో జనరల్ మేనేజర్ జీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరిస్తాం

- మైనారిటీ మంత్రి అజారుద్దీన్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్15: క్రిస్మస్ అనేది ఆనందం, సంతోషం, ఐక్యతతో పాటు ప్రేమ, శాంతి, కరుణ సందేశాలను సమాజానికి చాటి చెప్పే పవిత్ర పండుగ అని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల క్రిస్మస్ వేడుకల్లో అజారుద్దీన్‌పాల్గొన్నారు. తాను క్రైస్తవ విద్యాసంస్థలో చదువుకున్నానని, అక్కడ ప్రతి సంవత్సరం క్రిస్మస్‌ను ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకునే అవకాశం లభించిందని గుర్తు చేశారు. స్నేహితులు, ఉపాధ్యాయులతో కలిసి ఐక్యత, స్నేహభావం నిండిన వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్న రోజులను ఆయన స్మరించుకున్నారు. ఇటువంటి పండుగలు సామాజిక సామరస్యతను పెంపొందిస్తూ, భారతదేశపు "వైవిధ్యంలో ఏకత్వం" అనే మహత్తర సంప్రదాయాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, శాంతియుతంగా, సమగ్రంగా, ఆనందోత్సాహాలతో జరుపుకునేలా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. క్రైస్తవ సోదరసమాజానికి హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రైస్తవ సమాజానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రేవ్. డా. జాన్ వెస్లీ ప్రేరణాత్మక క్రైస్తవ సందేశాన్ని అందిస్తూ, ప్రేమ, శాంతి, కరుణ, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ సబిత, సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల సంఘ సభ్యులు లాల్ బహదూర్ శాస్త్రి, చిట్టి బాబు, శశిభూషణ్, మనోహరమ్మ, జాకబ్ రాస్ తదితరులు పాల్గొన్నారు. సెక్రటరియేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి ప్రేమ్, సెక్రటరీ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు రామ తదితరులు పాల్గొన్నారు.

రక్తమైసమ్మ ఆలయ భక్తుల కోసం బాత్ రూమ్‌ల నిర్మాణం

- ప్రారంభించిన నూతన సర్పంచ్ కృష్ణ

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 15: మండలంలోని అప్జాపూర్ రక్తమైసమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకి బాత్రూములు లేక ఇబ్బంది అవుతుందని వారి సౌకర్యార్థం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బాత్‌రూములు నిర్మించారు. సోమవారం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మద్యపాగ కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ తూర్పు జితేందర్ రెడ్డి, వార్డ్ మెంబర్లు కృష్ణప్రవీణ్, మద్యపాగ శ్రీనివాస్, దేవాలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, పండిత్ అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



"చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బీసీ హాస్టళ్లలోని విద్యార్థులకు తాజా, వేడి ఆహారం మాత్రమే అందించాలి. వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే ఇవ్వాలి. గదుల్లో దోమలు చొరబడకుండా తెరలు వాడాలి. వార్డెన్లు హాస్టల్లో భోజనాన్ని ముందుగా రుచి చూడాలి. ఆ తరువాత విద్యార్థులందరితో కలిసి భోజనం చేయాలి.

- ఏపీ బీసీ సంక్షేమ మంత్రి సవిత

ఓపెన్ వాయిస్

భారత్ వైపు అమెరికా కంపెనీల చూపు

ఒకప్పుడు అమెరికా కంపెనీలు భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికి అంతగా ఆసక్తిని చూపించేవి కాదు. ఒకవేళ పెట్టుబడులు పెట్టినప్పటికీ అనేక రకాల షరతులతో ఇక్కడికి వచ్చేవి. మనదేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడకపోవడం వల్ల విదేశీ పెట్టుబడిదారులలో నమ్మకం ఉండేది కాదు. దీంతో కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో దేశానికి అంతగా ఆదాయం ఉండేది కాదు. 2014 నుంచి ఇప్పటివరకు దేశంలో స్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడటం వల్ల పెట్టుబడిదారులలో నమ్మకం కలిగింది. దీనికితోడు ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు కంపెనీలకు అనుకూలంగా ఉంటున్నాయి. దీంతో అమెరికన్ కంపెనీలు భారతదేశంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. అందుకే భారత్ మీద నిత్యం విషం చిమ్ముతూనే ఉన్నారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టకుండా అమెరికా కంపెనీలను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. 145 కోట్ల వినియోగదారుల మార్కెట్ ఉన్న భారతదేశంలో పెట్టుబడులు పెట్టకపోతే తమకు లాభాలు రావని అమెరికన్ కంపెనీలు భావించి, మనదేశంలో భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. మైక్రోసాఫ్ట్ నుంచి మొదలు పెడితే అమెజాన్ వరకు అన్ని కంపెనీలు భారతదేశానికి క్యూ కడుతున్నాయి. అమెజాన్ ఇప్పటికే భారత దేశంలో విస్తృతంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది. మరో మూడు లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. మైక్రోసాఫ్ట్ కూడా 1,50,000 కోట్లతో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది. గూగుల్ కూడా అత్యంత విలువైన డాటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్తు కాలంలో ఇంకా ఎక్కువ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని గూగుల్ ప్రకటించింది. వాస్తవానికి ఈ మూడు సంస్థలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందు, ఆ కంపెనీ ప్రతినిధులను ట్రంప్ కలిశారు. మనదేశంలో పెట్టుబడులు పెట్టకుండా నిలిపివేయడానికి ప్రయత్నించారు. కానీ, ఆ కంపెనీలు ఏమాత్రం అందుకు ఒప్పుకోలేదు. అమెరికన్ కంపెనీలు భారతదేశంలోకి విపరీతంగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ట్రంప్ ఏమాత్రం సహించలేకపోతున్నారు. భారతదేశం మీద ఏదో ఒక రకంగా విమర్శలు చేస్తూనే ఉన్నారు. అమెరికన్ కంపెనీలను తీవ్రస్థాయిలో తప్పుపడుతున్న ట్రంప్.. తన రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా ఇండియాలోనే పెట్టుబడులు పెడుతుండడం విశేషం. ఇప్పటికే హైదరాబాదులో ట్రంప్ టవర్స్ పేరుతో రియల్ వ్యాపారాన్ని మొదలుపెట్టారు. అమెరికా అధ్యక్షుడు. భవిష్యత్ కాలంలో తన వ్యాపారాన్ని ఇంకా పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.అమెరికన్ కంపెనీలను మాత్రం నిలువరిస్తున్నారు. ట్రంప్ కు షాక్ ఇస్తూ అమెరికన్ కంపెనీలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడంతో ఆర్థిక రంగం సమూల మార్పులకు గురవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ ఆర్థిక శక్తులలో నాలుగో స్థానంలో ఉంది. ఇదే స్థాయిలో అమెరికన్ కంపెనీలు పెట్టుబడులు పెడితే నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు చైనా సహాయంతో రష్యా స్థానాన్ని అమెరికా లాగేసుకుందని. అయితే, ఇప్పుడు చైనాను అమెరికా నమ్మదని, అమెరికాను కూడా చైనా నమ్మదని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు. పైగా చైనాలో తన పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి అమెరికా ఇష్టపడదని, చైనాలో నియంతృత్వ ప్రభుత్వం ఉండడంతో అమెరికా కంపెనీలు ప్రత్యామ్నాయంగా భారత్ వైపు చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. భారత దేశంలో 145 కోట్ల జనాభా ఉన్న నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నాయని నిపుణులు అంటున్నారు. అమెరికా భారతదేశంపై వాణిజ్య ఒత్తిడి పెడుతున్నా, దాని సొంత ఆర్థిక -సాంకేతిక క్షేత్రాలు నష్టపోతున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానం విఫలమనే ఆరోపణలు ఎదుగుతున్నాయి. భారత్ తో పోలిస్తే, ఇజ్రాయిల్, రష్యా, గూగుల్ వంటి శక్తులు భారత్ తో భాగస్వామ్యం పెంచుతున్నాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్,
మంగళవారం
16.12.2025

కళల సృష్టికర్తల విగ్రహాలు పెట్టమనరా?

తెలంగాణ ఉద్యమం భౌగోళిక విభజన మాత్రమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి పది సంవత్సరాలు పూర్తయినప్పటికీ, ఇరు రాష్ట్రాలలో ఉన్న 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాలలోనూ అణిచివేతకు గురయ్యారు. సాంస్కృతిక కళా ప్రపంచంలో కూడా వీరికి చోటు లేదు. తెలుగు రాష్ట్రాలలో సాంస్కృతిక అస్తిత్వానికి కీలక పాత్ర పోషించిన ఎంతోమంది బహుజన కవులు, కళాకారులున్నారు. వీరంతా తమ కళల ద్వారా సామాజిక మార్పును తీసుకొచ్చారు. వారికి ఆదరణ కరువైనది. తెలంగాణ వచ్చాక గూడ అంజన్న, గద్దర్, అందెశ్రీతో పాటు ఎంతోమంది దళిత బహుజన కవులు, కళాకారులకు పరాభావమే ఎదురైంది.

సంపతి రమేశ్ మహారాజ్
7989579428

నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు తెలంగాణ భాష, యాస, సంస్కృతికి అన్యాయంపై మలి దశ తెలంగాణ ఉద్యమం జరిగింది. అనాడు తెలంగాణ ప్రముఖుల విగ్రహాలకు సరైన స్థానం ఇవ్వలేదని వివాదం జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన తెలంగాణ గడ్డపై విగ్రహాల వివాదం మళ్లీ చర్చ మొదలైనది. ఇప్పటికే లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహం ఆవిష్కరించారు. అప్పుడు తెలంగాణవాదుల నుంచి వ్యతిరేకత వచ్చింది. మళ్లీ ఇప్పుడు రవీంద్రభారతి ఆవరణలో ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటు చేశారు. అమీర్‌పేట్ చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహం పెడుతామని సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. రోశయ్య, ఎన్టీఆర్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ముగ్గురు ఆంధ్రా ప్రాంతానికే వ్యక్తులే కావడం, రాష్ట్ర విభజన తర్వాత కూడా ఆంధ్ర ప్రాంతం వాళ్ల విగ్రహాలు ఏర్పాటు చేయడమేంటన్న ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. బాలసుబ్రమణ్యం సమైక్యవాదాన్ని కోరుకున్నారని, ఆయన అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాటను పాడలేదని విమర్శ ఉంది. నిరుడు రాష్ట్ర గీతంగా ప్రకటించిన ఈ గేయాన్ని తెలంగాణ గాయకులు కూడా పాడలేదు. మరి కొన్ని రోజులుగా తెలంగాణ కళాకారుల బృందం బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ఆయన విగ్రహాన్ని కళలకు నిలయమైన రవీంద్రభారతి ముందు ఉద్రిక్త వాతావరణంలో నెలకొల్పారు. ఇదిలా ఉండగా కళాకారులకు కుల, ప్రాంతీయ బేధాలు అంటగట్టడం ఏంటని కొంతమంది తెలుగు రాష్ట్రాల కళాభిమానులు అంటున్నారు. ఇప్పుడు మరోసారి తెలంగాణ ఆంధ్ర విగ్రహాల రూపంలో వైశ్యామ్యాలు రగులుతున్న నేపథ్యంలో ఎవరి విగ్రహాలు ఉండాలి? ఎవరు కళలకు కేంద్రబిందువ నేది చర్చించుకోవాల్సిన సందర్భం.

సాంస్కృతిక పునర్జీవనంలో విగ్రహాలు

ప్రతి జాతి తమ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, కళల వారసత్వాన్ని పునర్జీవింపచేసుకోవడానికి విగ్రహాలు పెట్టుకుంటారు. ఈ విగ్రహాలు పెట్టే సంస్కృతి బుద్ధుని కాలంలోని వజ్రాయణ శాఖ నుంచి మొదలైనది. దీన్ని బుద్ధుడు తిరస్కరించినప్పటికీ, ఆయన నుంచి భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొంగి, విముక్తి పోరాటం చేయడానికి బుద్ధుని విగ్రహాలు పెట్టి ఆరాధించారు. ఆ తర్వాత అగ్రవర్ణాలు ఈ సంస్కృతిని అనుకరించి తమ రాజుల విగ్రహాలు పెట్టుకొని పూజించడం మొదలుపెట్టారు. ఇప్పటివరకు లభించే విగ్రహాలలో బుద్ధునివే పురాతనమైనవిగా ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. భారతదేశంలో విగ్రహాలు ప్రతిష్టించుకొనే ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ క్రమంలో తెలుగు వాళ్లను ఏకం చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1980 దశకంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ హుస్సేన్ సాగర్ సరస్సు ఒడ్డున, ట్యాంక్ బండ్ రోడ్డు వెంబడి తెలుగు వైతాళికుల విగ్రహాలను పెట్టారు. వీరంతా సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య పాత్ర పోషించారు. ఇందులో కూడా ప్రాంతీయ, కుల వివక్ష స్పష్టంగా ఉన్నది. ట్యాంకు బండిపై పెట్టిన 33 విగ్రహాలలో 26 ఆంధ్రా వారివైతే, తెలంగాణలో వారివి ఏడు మాత్రమే. ఇవన్నీ అగ్రకులాల విగ్రహాలే కావడం గమనార్హం. తెలంగాణ ఉద్యమ సమయంలో 2011 మార్చి 10 న జరిగిన మిలియన్ మార్చ్ ఉద్రిక్తంగా మారి ట్యాంక్ బండ్ విగ్రహాల ధ్వంసం కూడా జరిగింది.

కళారూపాలకు బహుజనులే వారసులు

చారిత్రకంగా భారతీయ సాంస్కృతిక కళారూపాలు బహుజనుల నుంచి ఆవిర్భవించాయి. ముఖ్యంగా వీరి శ్రామిక జీవనం నుంచే సంగీతం, పాటలకు, రంగస్థల నాటకాలు పుట్టాయి. కాబట్టి వారే వారసులు. క్రమక్రమంగా అవి ఆధునీకరించబడి సినిమా రంగంలోకి ప్రవేశించి పెద్ద మార్కెట్ గా మారాయి. ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్రకుల ఆధిపత్యం వలన బహుజన కళారూపాలు విధ్వంసం అయ్యాయి. బుర్రకథ, యక్షగానం, గంగిరెద్దుల ఆట, గోసంగి, ఒగ్గు కథ, ఇంద్రజాల కళ , బైండ్ల కథలు, గిరిజన నృత్యాలు వంటి కళారూపాలు అంతరించిపోయాయి. ఈ కళాకారులు కార్పొరేట్ సినీ కళాకారులతో పోటీ పడలేక దీనస్థితికి దిగజారారు. వీరికి అసలైన గౌరవం దక్కాలి. ఇప్పటివరకు తెలంగాణలో పెట్టిన విగ్రహాలన్నీ అగ్రకులాలవే. పెట్టబోతున్న మాజీ ఏపీ సీఎం రోశయ్య, ఎన్టీఆర్, ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాలు ఆధిపత్య కులాలకు చెందినవాళ్లవే. మరి వీళ్ళ విగ్రహాన్ని వ్యతిరేకించే బహుజన మేధావులు ప్రత్యామ్నాయంగా బహుజన కవులు, కళాకారులు విగ్రహాలు పెట్టాలని ఎందుకు డిమాండ్ చేయరు? 'మేకను పీక్కతినే పులి మా అడవిదే అని మేక వదిలేస్తే ఎలా? దేశంలో ఇప్పటికీ ప్రాంతీయ, జాతీయవాదం, వర్గ దృక్పథం ముసుగులో బహుజనులు కుల స్పృహను మరిచిపోతున్నారు. అసలు దేశంలో అన్నిరంగాలలో కుల ఆధిపత్యం కొనసాగుతుంది. ఇది కళలకు కూడా అతీతం కాదు. కళలకు కుల, ప్రాంతీయత అంటగట్టటమంటనే వాళ్లు అణగారిన కులాలు కళకారులకు ఏమేరకు గౌరవమిచ్చారనే ప్రశ్న వేసుకోవాలి.

దళిత బహుజన కళాకారుల విగ్రహాలు పెట్టాలి.

తెలంగాణ ఉద్యమం భౌగోళిక విభజన మాత్రమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి పది సంవత్సరాలు పూర్తయినప్పటికీ, ఇరు రాష్ట్రాలలో ఉన్న 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాలలోనూ అణిచివేతకు గురయ్యారు. సాంస్కృతిక కళా ప్రపంచంలో కూడా వీరికి చోటు లేదు. తెలుగు రాష్ట్రాలలో సాంస్కృతిక అస్తిత్వానికి కీలక పాత్ర పోషించిన ఎంతోమంది బహుజన కవులు, కళాకారులున్నారు. వీరంతా తమ కళల ద్వారా సామాజిక మార్పును తీసుకొచ్చారు. వారికి ఆదరణ కరువైనది. తెలంగాణ వచ్చాక గూడ అంజన్న, గద్దర్, అందెశ్రీతో పాటు ఎంతోమంది దళిత బహుజన కవులు, కళాకారులకు పరాభావమే ఎదురైంది. తెలుగు, తమిళ సినిమాలలో హీరోయిన్ గా రాణించిన బీసీ బిడ్డ (వంజర) ప్రత్యూష తెలంగాణ అమ్మాయి కులరక్కసికి బలైపోయినది. ఇలా వివక్షత గురైన ఆంధ్ర కళాకారులు కూడా ఎందరో ఉన్నారు. ప్రభుత్వాలు అధికారికంగా విగ్రహాలు పెట్టదలుచుకుంటే భౌగోళిక ప్రాంతాలకతీతంగా అట్టడుగు అణగారిన కళాకారుల విగ్రహాలను ప్రతిష్టించాలి. అప్పుడే ఈ దేశ పునర్నిర్మాణంలో భాగమైన ఆ వర్గాలకు విలువనిచ్చినట్టు. ఇది భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

నవ సమాజానికి నిర్మాణాత్మక దృక్పథం



సుంకవల్లి సత్తిరాజు
9704903463

శతాబ్దాల స్వాతంత్ర్య పోరాటం తర్వాత ఆంగ్ల జాతి నుండి ముక్తి పొందిన భారతదేశం నేటికి కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఆసియా ఖండంలో అత్యంత సిరి సంపదలున్న భారతదేశంలో పరాయి మూకల దౌర్జన్యాలతో, దండయాత్రలతో అపారమైన వనరులు కొల్లగొట్టబడ్డాయి. కులమతాలను రెచ్చగొట్టిన బ్రిటిషు పాలకులు దేశం వదలి పారిపోయినా వారి అవశేష జాఢ్యాలు మనల్ని వదలడం లేదు. అవినీతి, పేదరికం, ఉగ్రవాదం,మేథావుల విదేశీ వలస మన ప్రగతికి ప్రతి బంధకంగా మారాయి. అన్ని అవరోధాలను దాటుకుంటూ, గమ్యంలో ఎదురయ్యే ముళ్లపొదలను ఒక్కొక్కటిగా పెకలించుకుంటూ భారత్ అభివృద్ధి వైపు పయనం సాగించడానికి ప్రయత్నం చేస్తున్నది. బ్రిటిషు పాలకులు దేశంపై చిమ్మిన విషపు బీజాలు అప్పడప్పుడూ అంకురిస్తూనే ఉన్నాయి. వారి అవలక్షణాలు మనలను వెంటాడుతూ, వేధిస్తూనే ఉన్నాయి. కులమతాల వైషమ్యాలు, భాషా దురభిమానాలు,ప్రాంతీయ తత్వాలు భరతజాతి గుండెను కుదుటపడనీయడం లేదు. శత్రుశేషం పొంచి ఉంది. సరిహద్దు భద్రత ఇంకా ప్రమాదంలోనే ఉంది. అయినా మన త్రివిధ దళాల తెగువ, ధైర్యసాహసాలు మన ప్రశాంత జీవనానికి మార్గం సుగమం చేసాయి. దేశ విభజన భరతమాతకు తీరని వ్యథను మిగిలించగా, బంగ్లా విమోచనం మన దాయాది దేశపు పగను మరింత జ్వలింప చేసింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన 'పాక్' అంతర్జాతీయంగా అభాసుపాలై, ఒంటరిగా మిగిలినా తన దుశ్చర్యలకు పదును పెడుతూనే ఉంది. పహల్గామ్ దమనకాండ తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో పాక్ తన ధోరణి మార్చుకుంటుందని ఆశించడం అత్యాశే.

భారత్ ను దెబ్బతీయాలని ప్రయత్నించినా

ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు భారత్ పై అక్కసు పెంచుకోవడం, ప్రతీకార సుంకాలతో భారత్ ను దెబ్బతీయాలని ప్రయత్నించడంతో భారత్ చైనాకు దగ్గరవుతుందన్న సూచన లు కనిపించినా, ఇది ఆచరణ సాధ్యం కాదు. చైనా తన వక్రబుద్ధితో ఈ ఈశాన్య రాష్ట్రాలను కబళించాలనే 'డేగకన్ను'తో నిరంతరం మనపై ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నది. భద్రతామండలిలో మన దేశానికి శాశ్వత సభ్యత్వం రాకుండా మోకాలడ్డుతున్నది.పాకిస్తాన్ కు సమీప భవిష్యత్తులో తీవ్రనష్టం వాటిల్లనున్నా కేవలం మన దేశం మీదున్న గుడ్డి ద్వేషంతో పరాయి దేశాల వెంట పరుగెడుతున్నది. దాయాది దేశం తన కంటిని తానే పొడుచుకోవడానికి సిద్ధమవుతున్నది. భారత్ ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలనే కోరుకుంటున్నది. అయినా అవి పూర్తిగా మనకు సహకరించడం లేదనే చెప్పాలి. బంగ్లాదేశ్ విమోచనంలో మనమెంత సహాయపడినా ఆ దేశం తిరిగి పాక్ విష పరిష్వంగంలో సేద తీరుతున్నది. అయినా భారత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిలబడగలుగుతున్నది. దేశం విద్య, వైద్య, ఆరోగ్య, శాస్త్ర,సాంకేతిక రంగాలలో గణనీయ అభివృద్ధి సాధించింది. ఎంతగా దేశం వృద్ధిని సాధించినా, అభివృద్ధి ఫలాలు పెరిగిన జనాభాకు అందడం లేదు. స్వాతంత్ర్యానికి పూర్వం 39 కోట్లున్న భారత జనాభా నేడు 140 కోట్లకు చేరింది. పెరిగిన జనాభాకు సరిపడా ఆహారాన్ని, ఆవాసాన్ని కల్పించడం దేశానికి తలనొప్పిగా మారింది.

వెన్నెముక లాంటి వ్యవసాయరంగం

ఇదే సందర్భంలో దేశానికి వెన్నెముక లాంటి వ్యవసాయరంగం నిర్లక్ష్యానికి గురైనది. చదువుకున్న యువత విదేశీ వ్యామోహంతో 'బ్రెయిన్ డ్రెయిన్' సమస్య కొనసాగుతూనే ఉంది. భారతీయ మేధస్సు ఉషస్సులు విదేశాలపై ప్రసరించడంతో విదేశాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. మేధావుల వలసలను ఆపి, వారి మేధస్సుకు తగిన గుర్తింపు నిచ్చే చర్యలు ప్రారంభించకపోతే, అది దేశానికే పెనుశాపంలా మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. సువిశాల మన దేశంలో ఖనిజసంపదకూ, జలసంపదకూ, మానవ సంపదకూ లోటు లేనే లేదు. అయితే, వీటి వినియోగమే సరిగా లేదు. అవినీతి అనే మహమ్మారి భారతీయ సామాజిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నది. వీటితో పాటు విద్య, వైద్య,ఆరోగ్య రంగాలలో చోటుచేసుకుంటున్న వినాశకరమైన ధోరణి భావి ప్రగతికి గొడ్డలి పెట్టు. వీటిని సరిదిద్దే చర్యలు చేపట్టాలి. భారతదేశం లో వనరులకు కొరత లేదు. అయినా, అందరికీ కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్య వసతి కల్పించలేకపోతున్నాం. అపార జలసంపద ఉన్నా ఆ జలరాశిని వినియోగంలోకి తేలేకపోతున్నాం. నదుల అనుసంధానమే వృథాగా కడలి పాలవుతున్న జలసంపద సద్వినియోగానికి ఏకైక మార్గం. నేటికీ దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో చాలామంది పరిశుభ్రమైన తాగునీటికి నోచుకోలేక, రోగాల పాలవుతున్నారు. పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్టు కానవస్తుంది. సరైన త్రాగునీటి సదుపాయం లేదు. చాలా పాఠశాలలలో ఈనాటికీ సరైన మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు లేక చాలా మంది బాలికలు చదువుకు దూరమౌతున్నారు. విద్యా వ్యవస్థను చక్కదిద్దే ముందు పాఠశాలలలో కనీస సదుపాయాలను మెరుగు పరచాలి. .

సంప్రదాయబద్ధ వృత్తులు లేవు

గతంలో మాదిరిగా దేశంలో సంప్రదాయబద్ధ వృత్తులు లేవు. విద్యావంతులంతా ఉద్యోగవేటలో పడిపోవడం తో వ్యవసాయం రంగం అనాథలా మారిపోయింది. ప్రపంచం ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్నా, భారతదేశం ఆర్థిక మాంద్యపు కోరలలో చిక్కక పోవడానికి ప్రధాన కారణం మనది వ్యవసాయిక దేశం కావడమే. ఏనాటికైనా మన దేశాన్ని జీవనాడి వ్యవసాయరంగమే. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు వ్యవసాయ రంగాన్ని కూడా ఇతోధికంగా ప్రోత్సహించాలి. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు.రైతన్న బ్రతుకులకు భద్రత కావాలి. వ్యవసాయ రంగంతో పాటు భావి భారతాన్ని సుశోభితం చేసే విద్యారంగాన్ని మెరుగు పరచాలి. మొత్తం విద్యారంగాన్ని ప్రభుత్వమే నడపాలి. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా అందరికీ సమానమైన విద్యావకాశాలు రావాలి. అన్ని స్థాయిల్లోను విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి. ఉచిత విద్యను అందించాలి.భారతదేశం ప్రగతి పథంలో ముందుకు దూసుకు పోవాలంటే అవినీతి జాడ్యం అంతరించాలి. ఇది నా దేశం అనే భావన ప్రతీ ఒక్కరిలో నరనరాన జీర్ణించుకు పోవాలి. శతకోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలున్నట్టు దేశంలోని సమస్యలన్నింటికీ మార్గాన్వేషణ చేయాలి. సంకుచిత భావాలు, స్వార్థచింతన కొంత మేరకు కట్టిపెట్టి దేశహితం కోసం పాటు పడాలి.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)

పతనం పరేషానీనా? పఠాన్ లా పాఠమా?!

ఫిరోజ్ ఖాన్
9640466464

భారతదేశం 'చంద్రయాన్-3'ని చూసి జబర్దస్తీగా ఖుషీ అయ్యింది. మరీ ఆ విజయం వెనుక, ఇస్రో తొలి ఫెయిల్యూర్ల నుండి నేర్చుకున్న 'కఠిన శిక్షణ' అసలు మూలధనం కాదా? ఒకపక్క టెస్లా సాబ్ ఎలాన్ మస్క్ తన రాకెట్లు దఫా దఫా విఫలమైనా మళ్లీ నిలబడుతున్నాడు, కానీ, మన యువతరం మాత్రం ఒకే ఒక్క విఫలయత్నంతో 'జిందగీ ఖతం' అనుకుంటున్నారు. సుప్రీంకోర్టులో న్యాయం కోసం ఓడిన ఒక వాదన, రేపటి నూతన చట్టాల కోసం ఒక రోడ్‌మ్యాప్ కాగలదు. ఈ ఓటమి పరేషానీ (ఆందోళన) పట్టుకొని కోట్లాది యువత కొత్త ప్రయోగాలు చేయకుండా 'దూరం' అవుతున్నప్పుడు, మన దేశం ఎట్లా ఎదగాలి? అందుకే, ఓటమిని 'ఆఖరి అంకం'గా చూసే సంస్కృతిని నేడు సవాల్ చేయాలి. పడిపోయిన ప్రతి అడుగు ప్రాథమిక చట్టం కాదా? ఓటమి పాఠమా లేక పరాభవమా? ఈ సంకుచిత ధోరణిని తేల్చేయండి! సమాజంలో వైఫల్యమును చూసే తీరు అస్సలు సరైనది కాదు. ఒక లక్ష్యం కోసం చేసిన ప్రయత్నం లో అపజయం వస్తే, దాన్ని వ్యక్తిత్వ సమస్య గా ఫిక్స్ చేసేస్తున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రన్స్‌లలో ఫెయిల్ అయిన పిల్లలు 'ఆత్మన్యూనత'తో పరేషాన్ అవుతున్నారు. ఈ రకమైన 'నెగటివ్' ఆలోచనలతోనే యువత కొత్త 'రిస్క్'లు తీసుకోవడం లేదు. నిజముగా, వైఫల్యము అంటే శిక్ష కాదు, అది మన చర్యలో ఏ మార్గాలు పనికిరావు అని చెప్పే ఒక విలువైన సలహా మాత్రమే.

భారతీయ విజ్ఞాన రంగంలో అద్భుత నిదర్శనం

మన భారతీయ సైన్స్ చరిత్రలో కూడా వైఫల్యం తర్వాతే 'షాన్ దార్' విజయాలు దక్కాయి. మిస్సైల్ మాన్ డాక్టర్ అబ్దుల్ కలాం తొలి ఉపగ్రహ ప్రయోగము విఫలమైనప్పుడు, ఆ అపజయాన్ని ధావన్ తన భుజాల మీద వేసుకున్నారు. ఈ 'లీడర్‌షిప్' వల్ల, సైంటిస్టులు భయం లేకుండా 'ఫాల్ట్స్' సరిదిద్దుకుని మళ్లీ 'దమ్ దార్' విజయం సాధించారు. వైఫల్యం ఒక జ్ఞాన నిధి. అది మన 'అహంకారం ను తగ్గించి, నిజాన్ని అంగీకరించే ధైర్యం ఇస్తుంది. న్యాయ వ్యవస్థలో 'ఓడిపోవడం' కొత్తేం కాదు. ఒక లాయర్ ముఖ్యమైన కేసు ఓడిపోతే, అది కోల్పోయిన కేసు కాదు. ఆ 'అనుభవం' న్యాయ సూత్రాలు, సాక్ష్యాధారాల విలువ, జడ్జి ఆలోచనా సరళిని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. రాజ్యాంగ హక్కుల కోసం దాఖలు చేసిన పిటిషన్లు కొన్నిసార్లు వెంటనే 'ఫలితం' ఇవ్వకపోయినా, అవి భవిష్యత్తులో కొత్త న్యాయ మార్గాలకు 'గైడ్‌లైన్స్' అవుతాయి. పట్టుదల ఉంటేనే ఏ యుద్ధం అయినా గెలవగలం. ఈ అభివృద్ధి ప్రపంచంలో వైఫల్యాన్ని స్వాగతించాలి. ఎలాన్ మస్క్, స్పేస్‌ఎక్స్ వైఫల్యాలు మనకో 'సబ్ క్వెస్చన్' వేస్తున్నాయి. తొలి మూడు రాకెట్ ప్రయోగాలు విఫలమైనా, మస్క్ మూర్ఖత్వం గా భావించకుండా, వాటినుండి నేర్చుకున్నాడు. ఒకపక్క ఈ బిలియనీర్ 'నిలకడ' చూపిస్తుంటే, మన యువతరం మాత్రం ఒకే ఒక్క పరీక్షలో ఫెయిలై 'దిల్ ఛోటా' చేసుకుంటున్నారు. ఈ 'విఫల ప్రయోగాల'ను 'మేధో సంపత్తి'గా భావించి, కొత్త 'జోష్' తో ముందుకు పోవాలి.

అపజయ భయం

వైఫల్యాలను శాపంలాగా చూసే సంస్కృతి యువత 'మెంటల్ హెల్త్'ను చెడిపోయేలా చేస్తోంది. తాము ఆశించిన 'రిజల్ట్' రాకపోతే, తమను తాము నిందించుకుంటూ, బాధ పడుతున్నారు. ఈ పరిస్థితి తగ్గించడానికి 'వృద్ధీ మనస్తత్వము' చాలా అవసరం. వైఫల్యం ఒక వ్యక్తి 'క్వాలిటీ'ని నిర్ణయించదని, అది నేర్చుకునే భాగం మాత్రమేనని యువత నమ్మాలి. అప్పుడే గౌరవంగా జీవితాన్ని జీవించగలం. మనము 'ఫోకస్'ను కేవలం ఫలితం మీద కాక, ప్రయత్నము మరియు పద్ధతి మీద పెట్టాలి. మహాత్మా గాంధీ తన ఉద్యమాలలో తాత్కాలికంగా విఫలమైనా, ఆయన పట్టుదలే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది. మనం సాధించబోయే ప్రతి ఘన విజయానికి పునాదిగా, దానికి ముందు జరిగిన ఒక పెద్ద పతనం ఉంటుంది. ఓటమికి భయపడడం మానేసి, దానిని మన ప్రయోజనం కోసం వాడుకుందాం. పడిపోవడం తప్పు కాదు, నిలకడతో అడుగు వేస్తే, అపజయం కేవలం ఒక చిన్న 'రెండు నిమిషాల బ్రేక్' మాత్రమే. ఓటమిని 'సబ్ క్వశ్చన్'గా స్వీకరిస్తే, విజయం సమాధానం అవుతుంది. పరాభవంగా భావిస్తే, 'పతనం' ఖాయం. ఈ వాస్తవాన్ని సమాజము ఇకనైనా తెలుసుకోవాలి.

(వ్యాస రచయిత సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

ప్రాంతీయం

గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేటలో బీఆర్ఎస్ సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 15: సిద్దిపేట నియోజకవర్గంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. మొత్తం 91 గ్రామ పంచాయతీలకు గాను 77 గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు గెలిచిన సర్పంచ్‌లకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచినవారు ఒదిగిఉండుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రీష్‌రావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో ముందున్న పల్లెలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. కెసిఆర్ పాలనలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దిన పల్లెలు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించాయని గుర్తు చేశారు. అయితే గత రెండేళ్లలో రాష్ట్రానికి ఒక్క అవార్డు కూడా రాకపోవడం ప్రభుత్వ వైఫల్యమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ వంటి పథకాలు గ్రామాల రూపురేఖలను మార్చాయని, నేడు కాలం కాకున్నా కాలువల్లో నీళ్లు వస్తున్నాయంటే అది కెసిఆర్ ఘనతేనని అన్నారు. పదేళ్లలో సిద్దిపేట 60 జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిందని తెలిపారు. గెలిచిన సర్పంచ్‌లతో హరీష్ రావు క్యాంప్ కార్యాలయం సందడిగా మారింది. సుమారు ఆరు గంటల పాటు వచ్చిన సర్పంచ్‌లు, గ్రామ పాలక వర్గ సభ్యులను హరీష్‌రావు ఆత్మీయంగా అభినందించి సన్మానించారు.

గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

ప్రతిపక్షం,దౌల్తాబాద్, డిసెంబర్ 15: గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఫారు క్ హుస్సేన్ అన్నారు. ఇటీవలే మొదటి విడతలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన పంజ స్వామి, తన పాలకవర్గంతో సోమవారం మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును, మాజీ ఎమ్మెల్సీ పారు క్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచిగా ఎన్నికైన పంచ స్వామిని పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్

- చెరుకు శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 15: ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది అని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం దుబ్బాక మండలం ఆరేపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన చెట్టి శ్రీనివాస్, అలాగే వార్డు సభ్యులు ప్రసాద్, నవీన్, చెట్టి నవ్య ను శాలువాలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆరేపల్లి గ్రామ అభివృద్ధికి నూతన సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల సమిష్టి కృషి అత్యంత అవసరమని, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భారత్ , పోతరం మాజీ సర్పంచ్ గ డిల జనార్ధన్ రెడ్డి, దుబ్బాక మున్సిపాలిటీ 20 వార్డు ఇన్చార్జి ఇరేని సాయి తేజ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్ రెడ్డి, ఆలేటి సరోజన , కార్యకర్తలు, గ్రామ ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

బి కొండాపూర్ సర్పంచ్‌గా రాజిరెడ్డి

ప్రతిపక్షం,చేగుంట,డిసెంబర్15: చేగుంట మండలం కొండాపూర్ సర్పంచ్ గా రంగయ్య గారి రాజిరెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్‌ప్రత్యర్థి రమేష్‌గుప్త పై మెజార్టీ ఓట్లు సాధించిన రంగయ్య గారి రాజిరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రంగయ్య గారి ప్రవీణ రాజిరెడ్డిలను సన్మానించారు. మాజీ ఎంపీటీసీ గూటం నవీన్ వార్డు సభ్యులు బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం బలపరిచిన అభ్యర్థి గెలుపు ప్రజల గెలుపు

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 15 : చేగుంట మండలం చిట్టొజిపల్లి గ్రామంలో సిపిఎం బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి లక్ష్మి నర్సయ్య 163 ఓట్ల మెజారితో గెలవడం ప్రజల గెలుపని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు అన్నారు. సోమవారం మెదక్ కేవల్ కిషన్ భవనం లో ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ విడత గ్రామ పంచాయితీ ఎన్నికలలో చిట్టొచ్చిపల్లి గ్రామంలో సర్పంచ్ గా గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే సిపిఎం సర్పంచ్ లక్ష్మి నర్సయ్య మొదటి సర్పంచ్ అనీ గుర్తుచేశారు. ఉమ్మడి జిల్లా ఉన్న పటికీ నుండి లక్ష్మి నర్సయ్య ప్రజా పోరాటాలు, రైతు పోరాటాలలో బలమైన ముద్ర వేసుకున్నారని, అందుకే 9మంది అభ్యర్థులు ఉన్న ప్రజలు సిపిఎం పై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించడం సిపిఎం పోరాటాలకు బలం చేకూర్చిందని, ప్రజల నమ్మకాని కచ్చితంగా సిపిఎం నెరవేర్చడం కోసం సర్పంచ్ లక్ష్మి నర్సయ్య కృషి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, జిల్లా కార్యదర్శి నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, మహేందర్ రెడ్డి, బస్వరాజు, బాలమణి, మల్లేశం, కార్యవర్గ సభ్యులు కదారి నాగరాజు, సంతోష్, గౌరయ్య, అజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల ఫోరం కాంగ్రెస్ అధ్యక్షులుగా 'వెంకటేష్'

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), డిసెంబర్ 15: వర్గల్ మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా కీసర వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు నాచగిరి శివారులోని ఓ విశ్రాంతి భవనంలో సమావేశమయ్యారు. ఈ మేరకు సర్పంచులు వెంకటేష్‌కు మద్దతు పలకగా, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అనంతరం కీసర వెంకటేష్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మంత్రి వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షారెడ్డిల సహకారంతో నిధుల మంజూరీకి కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు సాయి గౌడ్, నేతలు ప్రభుదాస్ గౌడ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మీర్జాపూర్ అభివృద్దే నా లక్ష్యం

- సర్పంచ్ అభ్యర్థి వేల్పుల సంపత్ కుమార్

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 15: హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి వేల్పుల సంపత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజ్, శుద్ధ త్రాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే హనుమాన్ టెంపుల్‌లో అవసరమైన నిర్మాణ పనులు చేపడతామన్నారు. పారదర్శక పరిపాలనతో ప్రతి నెల గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వ పథకాలను న్యాయంగా అమలు చేస్తానని అన్నారు. మీర్జాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం, ఆశీర్వాదాలు అందించాలని ఆయన కోరారు.

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

- నిజాంపేట్ సర్పంచ్ చలిమేటి నరేందర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 15: గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని నిజాంపేట్ గ్రామ సర్పంచ్ చలమేటి నరేందర్ అన్నారు. గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల్లో భాగంగా నిజాంపేట్ గ్రామ సర్పంచ్ గా బిజెపి అభ్యర్థి చలిమేటి నరేందర్ అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పంజ మహేందర్ పై 459 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సోమవారం నిజాంపేట గ్రామంలో సర్పంచ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చలిమేటి. నరేందర్ ను గ్రామంలో పలువురు శాలువతో ఘనంగా సన్మానించారు.అనంతరం సర్పంచ్ చలిమేటి. నరేందర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అభివృద్ధి, పారదర్శక పాలనతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో పరదర్శకంగా వ్యవహారిస్తానని ఈ విజయం తన వ్యక్తిగత గెలుపు కాదని,నిజాంపేట్ ప్రజల విశ్వాసానికి ప్రతీక మాత్రమేనని గ్రామ ప్రజల విశ్వాసానికి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ పేర్కొన్నారు. తనకు ఓటేసి గెలిపించిన గ్రామ ప్రజలకు,తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ ర్యాలీలో ఉప్ప సర్పంచ్ గేరిగంటి. బాబు వార్డ్ సభ్యులు ప్రశాంత్, ఎల్లం,కిషోర్, దుర్గయ్య, మల్లేశం, యండి. నసీమ మిరజా గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అవసరాలకై అధికార పార్టీకి అండగా ఉండాలి

- డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 15: జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తున్న అభ్యర్థికి ఓటు వేస్తే పార్టీతో పాటు ప్రభుత్వం ఆ గ్రామానికి అండగా ఉంటుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్షలు రెడ్డి అన్నారు. సోమవారం కొండపాక మండల కేంద్రంలో సర్పంచ్ ఎలక్షన్ లో ప్రచారం భాగంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సూచనల మేరకు సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి సి సి బి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, గజ్వేల్ టౌన్ ప్రధాన కార్యదర్శి రాములు, కొండ పోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానించిన పద్మాదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 14: మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గా బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన కుమ్మరి. పద్మ జగన్, వార్డ్ సభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డిని సోమవారం నివాసం హైదరాబాద్ కొంపల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి గ్రామ సర్పంచ్ కుమ్మరి.పద్మ జగన్, ఉప సర్పంచ్ వంకిడి రాము, వార్డ్ సభ్యులు మద్దెల భూమేష్, చాకలి కిష్టవ్వ ,సాయిరి రామక్రిష్ణ,భీమరి నవనీత,బోయిని సుజాత, గుడ్డింగారి దుర్గయ్యలను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.ఎన్నికల్లో గెలవడం ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందించాలని నూతనంగా గెలిచిన సర్పంచ్ అభ్యర్థులకు సూచించారు.పదవి కాలంలో ఉన్నంతకాలం ప్రజలకు చేసిన సేవలే శాశ్వతంగా గుర్తుండి పోతాయన్నారు.ఈ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్
- నూతన సర్పంచులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 15:- గ్రామ పంచాయతీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని గ్రామాలు అభివృద్ధి చెందుతూనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయని అందుకే గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు సోమవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామపంచాయతీలో నూతనగా ఎన్నికైన గ్రామ సర్పంచులను గ్రామ వార్డులు మెంబర్లను ఆయన ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను మన పైన పార్టీ పైన నమ్మకంతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో చేసుకున్న అభివృద్ధి, సేవా,సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అతి తొందరలోనే రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కిషన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి. యువజన కాంగ్రెస్ నాయకుడు పరశురాం గౌడ్. మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్. హఫీజ్ మల్ సాబ్. బొజ్జ పవన్. మాజీ కౌన్సిలర్లు ముత్యం గౌడ్ మధుసూదన్ రావు దయారా లింగం తోపాటు యువజన కాంగ్రెస్ నాయకులు తుడుపునూరు రాము. తోపాటు నూతనంగా ఎన్నికైన నూతనగా ఎన్నికైన సర్పంచులు వార్డు మెంబర్లు ఉపసర్పంచులను పాల్గొన్నారు.

"



బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా కేంద్రం తొక్కిపెడుతోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పోరాటం ఆగలేదు. పోరాటానికి అన్ని పార్టీలు కలసిరావాలి. బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టాలని సీఎం రేవంత్ రాహుల్ గాంధీని కోరారు. బీజేపీ ఎన్నిరోజులు ఆపాలనుకున్నా అది సాధ్యం కాదు. బిల్లు సాకారమయ్యే రోజు ఎంతో దూరం లేదు.

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ప్రాంతీయం

కాంగ్రెస్ పార్టీలోకి మాజీ సర్పంచ్ సరిత గట్టయ్య

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, డిసెంబర్ 15: జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు మరియు పిఎసిసిఎస్ చైర్మన్ చల్లా తిరుపతయ్యల ఆధ్వర్యంలో జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు తలారి సరితగట్టయ్య కాంగ్రెస్ కండువా ఒక కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏకగ్రీవంగా గెలిచిన ఐదవ వార్డు సభ్యులు తలారి సమ్మయ్య, ఆరవ వార్డు అభ్యర్థి గోగుల రాజేశ్వరిరాజులు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తలారి గట్టయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చల్ల సమ్మిరెడ్డి గెలుపుకు శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గ్రామ మాజీ సర్పంచ్ కోట సమ్మయ్య, కుదురుపల్లి మాజీ ఉపసర్పంచ్ గోగుల లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ దొడ్ల అశోక్, మాజీ వార్డ్ మెంబర్ గోగుల పర్వతాలు, గోగుల మదన్ మోహన్, చల్ల మహేందర్, కేశవ రెడ్డి అమురాజ్ సాగర్, ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డ్ సభ్యులు, మారబోయిన రాజయ్య, గుర్రాల నాగరాజు, సల్లాం రాజు, అమురాజ్ రవి తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 15: ఈ నెల 17న జరగనున్న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు శివ కుమార్ నాయుడు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ ల సమక్షంలో సోమవారం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు, కలెక్టర్ లు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఆత్మకూర్, దామెర, నడికూడ, శాయంపేట మండలాల వారీగా ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలో మూడవ విడతలో గల 68 గ్రామ పంచాయతీల సర్పంచ్, 634 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 626 ప్రిసైడింగ్ అధికారులు, ఓ. పీ. ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగింది.ర్యాండమైజేషన్ ప్రక్రియలో డిఆర్.డి.ఓ మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జెడ్పి సీఈఓ రవి, తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 15: జిల్లాలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ర్యాండమైజేషన్ విధానంలో పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ తో సమీక్షించారు. గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికలు నిర్వహించే మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్యే పాయం

ప్రతిపక్షం, గుండాల, డిసెంబర్ 15: గుండాల మండల వ్యాప్తంగా జరుగుతున్న గ్రామపంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే గ్రామాల అభివృద్ధికి కీలకమని ఆయన ప్రజలకు స్పష్టం చేశారు. ప్రచార యాత్రలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ప్రజలతో నేరుగా మాట్లాడి గ్రామస్థాయి సమస్యలు, అభివృద్ధి అవసరాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గ్రామాల పురోగతికి పంచాయతీలే పునాది అని, అభివృద్ధి కొనసాగాలంటే స్ఫూర్తిదాయక నాయకత్వం అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా ప్రజలకు చేరాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల నాయకత్వం అత్యంత అవసరమని, గ్రామస్థాయి నాయకత్వం బలంగా ఉంటేనే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్కే ఖదీర్ మాట్లాడుతూ అధికార పార్టీని గెలిపించుకుంటేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. గత 40 ఏళ్లుగా గ్రామపంచాయతీని పాలించిన వారు ఏం అభివృద్ధి చేశారో ప్రజలు ఆలోచించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో పీఎస్ఆర్పీవీఆర్ యువసేన కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎస్కే ఖదీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దార అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాంబోయిన ముత్తయ్య, ఆయా గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, ఎస్కే అబ్దుల్ నభి, ఎస్కే వాజీద్, ఎస్కే కాసీం, బొంగు చంద్రశేఖర్, పల్లపు రాజేష్, సోషల్ మీడియా నాయకులు మండలోజు కిరణ్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాధువుల రాకతో పులకరించిన కాళేశ్వరం

- స్వాగతం పలికిన ఆలయ అధికారులు

ప్రతిపక్షం, భూపాలపల్లి, ప్రతినిధి: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావనకు చెందిన పీఠాదీశ్వర్ జగద్గురు స్వామి రాజేంద్ర దాస్ జి మహారాజ్ తోపాటు భాగేశ్వర్ ధాం సర్కార్ మహారాజ్, సద్గురు శివలింగ్ మహారాజ్, కేదారేశ్వర పలుగుట్ట రాములు మహరాజ్ లతోపాటు 600 మంది సాధువులు కాళేశ్వరం పుణ్యక్షేత్రాన్ని దర్శించారు. గోదావరి నది పరిక్రమలో భాగంగా కాళేశ్వర పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో అభిషేక, శుభానంద దేవి అమ్మవారికి పూజాధికాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన సాధువులను ఆలయ అధికారులు అర్చకులు రాజగోపురం వద్ద పూర్ణ కుంభముతో స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకం, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు మహాదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామీజీ కాళేశ్వర క్షేత్రం విశిష్టత గురించి సరస్వతి పుష్కరాల గురించి భక్తులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ మహేష్, భక్తులు, మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాటారం డీ ఎస్ పి సూర్య నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని పొర్లు దండాలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 15: కరీంనగర్ స్మార్ట్ సిటీ పరిధిలోని మూడో డివిజన్ కిసాన్ నగర్ ప్రాంత అభివృద్ధి కోసం, డివిజన్ పరిధిలోని రోడ్లు ,డ్రైనేజీ ల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజున స్థానిక బిజెపి నేత , కంటెస్టెడ్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ నిరసన కార్యక్రమం చేపట్టారు. కిసాన్ నగర్ బీడీ కంపెనీ నుండి మీ సేవ వరకు సోమిడి వేణు మా ప్రాంతాన్ని అభివృద్ధి చేయండి అని పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమిడి వేణు మాట్లాడుతూ కిసాన్ నగర్ ప్రాంత అభివృద్ధి విషయంలో గత ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. జిల్లా అధికారులకు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేకమార్లు ఇక్కడి ప్రాంత అభివృద్ధి కోసం వినతి పత్రాలు సమర్పించిన సమస్యలను పరిష్కరించుదామన్న ఆలోచన చేయలేదన్నారు. డివిజన్ ప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. డివిజన్లో కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. వర్షాకాలంలో ఇక్కడి ప్రాంతంలోని రోడ్లు, మురికి కాలువల పరిస్థితి దారుణంగా మారి, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారవుతున్నాయన్నారు. ఎన్నోమార్లు వినతి పత్రాలు సమర్పించిన ఫలితం లేకపోవడంతోనే , బిజెపి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలు తీవ్రంగా ఇక్కడి ప్రాంతంలో ఎదుర్కొంటున్న ప్రధాన రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించి డివిజన్ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి నాయకులు మెంగని రాజయ్య, బండిపల్లి సంజీవ్,గాలి సురేష్, కళ్యాణ్,సుమన్ చాడ ఆనంద్ మేకల సాయి, , కార్యకర్తలు, స్థానిక డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

తుది విడత పోలింగ్ సిబ్బంది కేటాయింపు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 15 : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడవ విడతలో ఎన్నికలు జరిగే మండలాల పోలింగ్ సిబ్బంది తుది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ సమక్షంలో సోమవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఏకగ్రీవం అయిన వాటిని మినహాయిస్తూ, ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న మిగిలిన గ్రామ పంచాయతీలకు సంబంధించి ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించారు. ఈ ప్రక్రియలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, నోడల్ అధికారి పవన్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్లోని ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీమ్గల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలో గల గ్రామాలలో జరగనున్న మూడో విడత ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈనెలా 17న ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం సర్పంచ్ స్థానాలు 165 ఉండగా, 19 గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 146 గ్రామాలలో ఎన్నికలు జరగనున్నాయి. పోటీలో 562 మంది ఉన్న అభ్యర్థులు బరిలో ఉన్నారు. 1620 వార్డు స్థానాలలో 490 ఏకగ్రీవం కాగా, 1130 వార్డు లలో ఎన్నికలు జరగనున్నాయి. 3382 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆర్మూర్ డివిజన్లో 3,06,795 మంది ఓటర్లు ఉండగా, 1490 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీనికిగాను పీవోలు 1490, ఓపీవోలు 2278, సిబ్బంది తరలింపునకు రూట్లు 38, మైక్రో అబ్జర్వర్లు 58, జోనల్ అధికారులు 38, వెబ్ క్యాస్టింగ్ పోలింగ్ కేంద్రాలు 51 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గెలిచేది ఒకరు, ఏలేది మరొకరు

- ఆదివాసి సంక్షేమ పరిషత్

ప్రతిపక్షం, గుండాల, డిసెంబర్ 15: ముత్తాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన బైక్ ర్యాలీ అనంతరం పెద్దతోగు గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ బలపరిచిన స్వాతంత్ర్య అభ్యర్థి కల్తీ రాధ, మండల అధ్యక్షులు పూనెం రమణబాబు మాట్లాడుతూ ఆదివాసీల ఓట్లు తమ అభ్యర్థి వైపేనని స్పష్టం చేశారు.గిరిజనేతర రాజకీయ పార్టీలకు ఓటమి భయం మొదలైందని, అందుకే బెదిరింపులు, చౌకబారు వ్యాఖ్యలకు దిగజారుతున్నారని విమర్శించారు. 1/70 చట్టాన్ని సవరించాలన్న ప్రచారం ద్వారా ఈ పార్టీలు ఆదివాసీ వ్యతిరేక వైఖరి బయటపడుతోందని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పటికీ నడిమిగూడెం, పెద్దతోగు గ్రామాల్లో కనీస అభివృద్ధి చేయలేదని ప్రజలే ప్రశ్నిస్తున్నారని తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని కలిసిన సర్పంచ్‌లు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 15 : వేల్పూర్ లోని నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరందరికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గం లోని 3 వ విడత సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఓడించి బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్ ఎన్నికల్లో ఓడించి చూపించినటువంటి స్ఫూర్తిని మూడో విడత ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గంలో కూడా చూపెట్టాలని, టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. ప్రశాంత్ రెడ్డి ను కలిసిన వారిలో మానాలా గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్ గౌడ్, సర్పంచ్ మాలవత్ రాందాస్ , ఉప సర్పంచ్ గుగులోత్ వినోద్, సరితా, తిరుపతి యశోద, బానోత్ మాలవత్ రజిత గుగులోత్, లావుడియా గంగాధర్, 4 గ్రామాల 30 వార్డు మెంబర్లు ఉన్నారు.

పాఠశాల సామాగ్రి ధ్వంసం చేసిన ఆకతాయిలు

- సందర్శించిన సిద్దిపేట కలెక్టర్.
- దుశ్చర్య కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 15 : కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిన్న పాఠశాలకు సెలవు రోజు కావడం తో ఆకతాయిలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి పాఠశాల యొక్క మరుగుదొడ్ల డోర్లు, ఎలెక్ట్రిసిటీ మీటర్ వైర్, తాగునీటి ట్యాప్ లు ఇతరత్ర సామాగ్రిని ధ్వంసం జరిగినందున సోమవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాఠశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల సామాగ్రిని ధ్వంసం చేయడం ఎవరనే విషయాలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో కలిసి ఆరా తీశారు. తక్షణమే డ్యామేజ్ అయినవి అన్ని రిపేర్ చేయిస్తామని తెలిపారు. ధ్వంసం చేసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేసి ఇలాంటి దుశ్చర్య కి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. మీకు ఎలాంటి ఆధారాలు దొరికినా పోలీస్ అధికారులకు తెలపాలని పాఠశాల అధికారులకు తెలిపారు. చుట్టు సిసి కెమెరాలు పెట్టించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాఠశాలకు సంబంధించిన ఎలెక్ట్రికిసిటీ కనెక్షన్, పర్నిచర్ ఇతరత్ర ఏ వస్తువు కూడా బయట ఉంచకుండా లోపల భద్రపరిచి తాళం వేసేలా ఉండాలని ప్రిన్సిపల్ కి సూచించారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులతో శిక్షిస్తామని తెలిపారు.

ఎన్నికల సామాగ్రి పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలి

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 15: ఈ నెల 17వ తేదీన మూడవ విడత ఎన్నికలు జరగనున్న బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ, బిచ్కొండ, బీర్కూర్, డోంగ్లి, జుక్కల్, మద్నూర్, నస్రుల్లాబాద్, పెద్ద కోడపగల్ మండలాలలో చేపట్టవలసిన ఏర్పాట్ల పై జిల్లా పాలనాధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ , జనరల్ అబ్జర్వర్ సత్యనారాయణరెడ్డి సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జడ్పీ సీఈఓ, ఆర్డీఓలు, డీఆర్డీఓ, డీఎల్పీఓ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జనరల్ అబ్జర్వర్ లు మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ సక్రమంగా, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలనీ, అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలనీ, అలాగే భోజన వసతులు కల్పించాలని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యేలా సరిపడా సిబ్బందిని నియమించుకోవాలని పోలింగ్ రోజే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా పూర్తిచేయాలన్నారు. పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని నివేదికలను నిర్దేశిత సమయంలో, నిర్దేశిత ఫార్మాట్లలో టిపోల్ యాప్ ద్వారా సబ్మిట్ చేయాలి. అలాగే కౌంటింగ్ కేంద్రాలలో వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ హాల్ కూడా విశాలంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు అంశాలపై సూచనలు సలహాలు చేశారు. ఎన్నికల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి మూడవ విడత ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అన్నారు.

విమాన ప్రయాణ ఛార్జీలను ఇష్టానుసారం వసూలు చేయకుండా కట్టడి చేస్తాం. టారిఫ్ మానిటరింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాం. విమాన టికెట్ రేట్లు ఎక్కువగా ఉన్నట్లు ప్రయాణికులు గమనిస్తే వాటి స్క్రీన్ షాట్లను మాకు పంపించొచ్చు. డొమెస్టిక్ మార్గాల్లోనే కాకుండా అంతర్జాతీయ రూట్ల ఛార్జీలనూ మానిటర్ చేస్తాం.

- పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

జోర్డాన్‌లో ప్రధాని మోడీకి ఘన స్వాగతం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 15: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు దేశాల పర్యటన సోమవారం మొదలైంది. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముందుగా జోర్డాన్ లోని అమ్మాన్ కు చేరుకున్నారు. అమ్మాన్ విమానాశ్రయంలో జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ స్వయంగా ప్రధాని మోదీకి స్వాగతం పలికి ప్రత్యేక గౌరవం కల్పించారు. మోదీ తన మూడు రోజుల పర్యటనలో భాగంగా జోర్డాన్ తర్వాత ఇథియోపియా, ఒమన్ దేశాలను సందర్శించనున్నారు. భారత్‌జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటన చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని జోర్డాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన రెండు రోజుల పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఇబ్న్ అల్ హుస్సేన్‌తో సమావేశమై ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే ప్రధాని జాఫర్ హసన్, యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లాతోనూ భేటీ కానున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇరుదేశాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడిని జోర్డాన్ రాజు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో తిరస్కరించాలని స్పష్టంచేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి. జోర్డాన్‌కు భారత్ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, ద్వైపాక్షిక వాణిజ్యం 2.8 బిలియన్ డాలర్లుగా ఉంది. కాగా జోర్డాన్‌లోని భారత సమాజం సైతం మోదీకి ఘనస్వాగతం పలికింది.

విశ్వ వీక్షణం

సింగిడి
హైదరాబాద్
మంగళవారం
16.12.2025

ప్రతిపక్షం
Prathipaksham.in

400 యేళ్లుగా వర్షం లేదు..

400 సంవత్సరాలుగా అక్కడ వర్షం కురవలేదు. దీంతో ఇప్పుడు ఆ ప్లేస్ ఎలా మారిపోయిందంటే.. మీరు కాని అక్కడికి వెళితే సైన్స్ ఫిక్షన్ సినిమాలోని సీన్లు చూసినట్లు ఉంటుంది. వందల ఏళ్లుగా చుక్కనీరు లేకపోవడంతో ఆ ప్రాంతం అంగారక గ్రహంలా కనిపిస్తుంది.

నాలుగు వందల సంవత్సరాలుగా వర్షం కురవకపోవడంతో ఇక్కడ ప్రకృతి దృశ్యాలు చాలా ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఇక్కడ ఉప్పు పొరలుగా ఏర్పడిపోయింది. గొప్ప ఆశ్చర్యం కలిగించే విషయం ఏంటంటే ఇక్కడ గాలి వల్ల చెక్కినట్టుగా రాతి నిర్మాణాలు తయారయ్యాయి. వీటిని చూస్తే ఎవరో చెక్కి ఇక్కడ పెట్టారా అన్నట్టు ఉంటుంది. విశాలమైన ఇసుక దిబ్బలు సైన్స్ ఫిక్షన్ సినిమాలోని దృశ్యాలను గుర్తుకు తెస్తాయి. అంతేకాకుండా ఎడారిలోని కొన్ని ప్రాంతాలు అంగారక గ్రహంలా కనిపిస్తాయి. ఇంత చిత్రమైన ప్రాంతం ఉత్తర చిలీలో ఉంది. అదే అటకామా ఎడారి. ఇది 1000 కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉంది. భూమిపై అత్యంత అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు కనిపించే ప్రాంతాల్లో ఇదొక్కటి. ఈ అటకామా ఎడారిలో వందల సంవత్సరాలుగా వర్షం పడలేదు. కొన్ని ప్రాంతాల్లో ఒక్క చుక్క నీరు కూడా లేకుండా శతాబ్దాలు గడిచిపోయాయి. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దాని అంగారక రోవర్‌ల కోసం పరీక్షా కేంద్రంగా ఈ ఎడారిని ఉపయోగిస్తుంది. చంద్రుని లోయ వంటి ప్రదేశాలు, గాలి వల్ల చెక్కినట్టుగా ఉండే శిఖరాలు కూడా ఈ ఎడారి ప్రాంతంలో ఉన్నాయి. 1570 నుండి 1971 వరకు అటకామా ఎడారిలో వర్షం పడలేదు. 1971లో అటకామా ఎడారిలో వర్షం పడింది. ఆ తర్వాత జరిగిన అటకామా ఎడారి పుష్పించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. వర్షం కారణంగా ఎడారి అంతటా రంగురంగుల పువ్వులు వికసించాయి. ఎల్ నినో సంఘటన కారణంగా ఇలాంటి వర్షం పడ్డప్పుడల్లా ఎడారి పుష్పాలతో నిండిపోతుంది. ఇటీవల అంటే 2024 జూలై నెలలో అటకామా ఎడారి పుష్పాలతో కళకళలాడింది. ఈ అద్భుత దృశ్యాన్ని చూడటానికి వేలాదిగా పర్యాటకులు అటకామాకు వెళ్లారు. అటకామా ఎడారి ప్రపంచంలోనే అతిపెద్ద పొగమంచు ఎడారి. భూమిపై వర్షపాతం దాదాపుగా లేని ప్రాంతం అయినప్పటికీ కొన్ని జీవులు ఈ ఎడారిలో నివసిస్తాయి. 'కమాన్చకా' అనే తీర ప్రాంత పొగమంచు వాటి మనుగడకు సహాయపడుతుంది. కమాన్చకా అనే దట్టమైన తీరప్రాంత పొగమంచు ఈ ఎడారిలోని అరుదైన జీవులను కాపాడుతుంది. పసిఫిక్ మహాసముద్రం నుండి వీచే ఈ పొగమంచు, ఎడారికి కొంత తేమను అందిస్తుంది. దీని వల్ల కొన్ని రకాల మొక్కలు, అరుదైన నాచు, కొన్ని జంతువులకు తగినంత నీరు లభిస్తుంది. అటకామా ఎడారిలోని కొన్ని ప్రాంతాల్లో సంవత్సరానికి ఒక మిల్లీమీటరు కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. కానీ ఈ ఎడారి భూమి కింద "అటకామా జలాశయం" అనే విస్తారమైన భూగర్భ జల నిల్వ ఉంది. ఇది పురాతన నీటి నిక్షేపాలు, ఆండీస్ పర్వతాల నుండి వచ్చే నీరని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అటకామాలో ఎల్ టాటియో గీజర్స్ అనే ప్రకృతి అద్భుతాన్ని కూడా చూడవచ్చు. ఇది అటకామాలో ఎత్తుగా ఉండే వేడి నీటి ప్రాంతం. సూర్యుడు ఉదయించే సమయంలో భూమిపై వేడి నీటి బుగ్గల నుండి ఆవిరి స్తంభాల రూపంలో బయటకు వెళ్లడం మీరు చూడవచ్చు. అటకామాలో మరో అద్భుతమైన ప్రదేశం చిలీలోని అతిపెద్ద ఉప్పు మైదానం. దీన్ని సాలార్ డి అటకామా అంటారు. ఇక్కడ భారీగా ఉప్పు నిక్షేపాలు ఉన్నాయి. అంతేకాకుండా ఫ్లెమింగో పక్షులు ప్రత్యేక ఆకర్షణ. సాన్ పెడ్రో డి అటకామా అనే ప్రాంతం అటకామా ఎడారి మధ్యలో ఉంది. ఇది అటకామెనో గిరిజన సంస్కృతికి నిలయమైన అందమైన నగరం. పురాతన శిలాశాసనాలు, పాత కోట శిథిలాలను ఇక్కడ చూడవచ్చు.

పహల్గాం దాడిలో పాక్ ప్రమేయం వాస్తవం

- సూత్రధారి లష్కరే తోయిబా అగ్రనేత

కశ్మీర్‌లోని బైసరన్ లోయలో ఎనిమిది నెలల క్రితం జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందనే వార్త నిజమైంది. 26 మంది పర్యటకులను బలిగొన్న దాడికి లష్కరే తోయిబా అగ్రనేత సూత్రధారి అని జాతీయ దర్యాప్తు సంస్థ తెలిపింది. యావత్ భారతాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ నరమేధానికి లష్కరే నేత ప్రణాళిక రచించాడని, ది రెసిస్టంట్ ఫ్రంట్ ఉగ్రవాదులు అమలు చేశారని ఎన్ఐఏ సోమవారం చార్జ్‌షీట్‌లో వెల్లడించింది. పహల్గాం దాడితో సంబంధమున్న ఏడుగురిపై ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. వీరిలో ఐదుగురు అనుమానితులు, ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా అగ్రనేత సాజిత్ జాట్, టీఆర్ఎఫ్‌కు చెందిన ఇద్దరు ఉన్నారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు సాజిత్ ఆయుధాలు సమకూర్చాడని ఎన్ఐఏ తమ 1,597 పేజీల సుదీర్ఘ చార్జిషీట్‌లో తెలిపింది. వీరిపై భారత న్యాయ సంహిత 2023లోని ఆయుధాల చట్టం 1959, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ చట్టం 1976ల కింద కేసులు నమోదు చేసింది. భారత్‌పై వీరు యుద్ధం ప్రకటించారని.. వీరిని కఠినంగా శిక్షించాలని ఎన్ఐఏ వర్గాలు చెప్పాయి. జూన్‌లో భారత సైన్యం చేతిలో హతమైన పాక్ ఉగ్రవాదులు సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హంజా అఫ్గనీల పేర్లను కూడా చార్జిషీట్‌లో పేర్కొంది ఎన్ఐఏ. జూలైలో భారత సైనికులు చేపట్టిన 'ఆపరేషన్ మహదేవ్' లో ముగ్గురు లష్కరే ప్రధాన ఉగ్రవాదులు సులేమాన్ షా, అఫ్గన్, జిబ్రాన్‌లు హతమయ్యారు. ఈ ముగ్గురు పహల్గాం దాడిలో పాల్గొన్నారని కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వెల్లడించారు.

ఇది తమిళనాడు.. మీ పప్పులుడకవ్

- బీజేపీపై సీఎం స్టాలిన్ ఫైర్

బీహార్ విజయవంతమయ్యామని, ఇక తమిళనాడు రాష్ట్రమే తమ టార్గెట్ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ స్పందించారు. ఇది తమిళనాడు రాష్ట్రమని, ఇక్కడ అహంకార బీజేపీ ఎప్పటికీ గెలవలేదని వ్యాఖ్యానించారు. అహంకారం కలిగిన ఏ పార్టీకి ఇక్కడ అవకాశం లేదని అన్నారు. అహంకారంతో ఊగిపోయే ఏ రాజకీయ శక్తినైనా తాము ప్రతిఘటిస్తామని స్టాలిన్ స్పష్టంచేశారు. తిరువణ్ణామలై జిల్లాలో జరిగిన పార్టీ యూత్ వింగ్ నార్త్ జోన్ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ.. అమిత్ షా లేదా సంఘ్ పరివార్ తమిళనాడులో విజయం సాధించలేరని అన్నారు. బీజేపీ తమిళ ప్రజల ఆలోచనను ఎప్పటికీ అర్థం చేసుకోలేదని వ్యాఖ్యానించారు. ప్రేమతో తమ వద్దకు వస్తే ఆలింగనం చేసుకుంటామని, అహంకారంతో వస్తే మాత్రం తలవంచే పరిస్థితి లేదని స్టాలిన్ హెచ్చరించారు. బీజేపీని నేరుగా ఎదుర్కొని ఓడిస్తామన్నారు. బీజేపీ వరుసగా మూడోసారి జాతీయస్థాయిలో అధికారంలోకి వచ్చిన తర్వాత మితవాద శక్తులు దూకుడుగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. మితవాద శక్తులు ప్రజలను మోసం చేయడానికి తియ్యని అబద్ధాలు చెబుతున్నాయని స్టాలిన్ విమర్శించారు. అలాంటి వారితో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీజేపీ ఎప్పటికీ తమిళనాడులో గెలువదని అన్నారు. అందుకే అమిత్ షా చిరాకు పడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా సైద్ధాంతిక యుద్ధం చేస్తున్న ఏకైక ప్రాంతీయ పార్టీ డీఎంకే మాత్రమే అన్నారు.

లోయలో పడ్డ బస్సు.. 17 మంది విద్యార్థుల మృతి

కొలంబియా: స్కూల్ బస్సు అదుపుతప్పి లోయలోపడింది. ఈ ఘటనలో 17 మంది విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కొలంబియా నైరుతి ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. విద్యార్థులు కొలంబియా తీరంలోని కరేబియన్ బీచ్‌లో తమ గ్రాడ్యుయేషన్‌ను సెలబ్రేట్ చేసుకుని తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. యాంటియోక్వియా గవర్నర్ ఆండ్రెస్ జులియన్ రెండాన్ ఈ ప్రమాదంపై స్పందించారు. బస్సు కరేబియన్ బీచ్ నుంచి మెడెల్లిన్‌కు వస్తుండగా ప్రమాదానికి గురైందని చెప్పారు. ఒక్కసారిగా బస్సు 40 అడుగుల లోతైన లోయలోకి జారిపోవడంతో భారీ ప్రాణ నష్టం జరిగిందని రెండాన్ అన్నారు. మృతుల్లో డ్రైవర్ కూడా ఉన్నాడని చెప్పారు. క్షతగాత్రులను మెడెల్లిన్ లీగల్ మెడిసిన్ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించినట్లు తెలిపారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

బోండీ బీచ్ ఉగ్రదాడి.. తండ్రీ కొడుకులే చేశారు

ఉగ్రవాదాన్ని పాక్ పెంచి పోషిస్తున్నది. భారత్‌పైనే కాదు ప్రపంచ దేశాలపైకి కూడా ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్నది. తాజాగా ఆస్ట్రేలియా సిడ్నీలోని బోండీబీచ్‌లో యూదుల హనుక్కా ఉత్సవంపై దాడికి పాల్పడింది పాకిస్థాన్‌కు చెందిన తండ్రీ కొడుకులుగా గుర్తించారు. క్రిస్మస్ సందర్భంగా రద్దీగా ఉండే సిడ్నీలోని బోండీ బీచ్ మార్కెట్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఉగ్రవాదులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల్లో ఓ పోలీసు అధికారి సహా 15 మంది మరణించగా, ఇద్దరు పోలీసులతోపాటు సుమారు 40 మంది గాయపడ్డారు. బాధితుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. కాగా, ఆ ఇద్దరు సాయుధులను తండ్రీకొడుకులుగా దర్యాప్తు బృందం గుర్తించింది. వీరిని 50 ఏండ్ల సాజిద్ అక్రమ్, 24 ఏండ్ల నవీద్ అక్రమ్ అని తెలిపారు. అయితే పోలీసులు జరిపిన ఎదురుదాడిలో సాజిద్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవీద్ ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. వారికి పాకిస్థాన్ మూలాలున్నాయని సీబీఎస్ న్యూస్ వెల్లడించింది. సాజిద్ పేరిట 2015 నుంచి తుపాకీ లైసెన్స్ ఉన్నట్లు న్యూసౌత్ వేల్స్ పోలీసులు తెలిపారు. అతడు ఓ హంటింగ్ క్లబ్‌లో కూడా సభ్యుడని చెప్పారు. దాడి సమయంలో ఘటనా స్థలం నుంచి కరడుగట్టిన ఉగ్రసంస్థ ఐసిస్ జెండా కనుగొన్నట్లు ప్రచారం జరిగింది. అయితే దీనిపై స్పందించేందుకు పోలీసులు నిరాకరించారు. దాడి వెనుక ఉద్దేశం ఏంటో తేలాల్సి ఉందని అంటున్నారు.

నేడే ఐపీఎల్ మినీ వేలం

ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలానికి వేళైంది. మంగళవారం అబుదాబి వేదికగా జరుగబోయే ఈ వేలం ప్రక్రియలో పది ఫ్రాంచైజీలు 77 స్లాట్స్ కోసం రూ. 237.55 కోట్లు వెచ్చించనున్నాయి. అత్యధికంగా కోల్‌కతా నైట్ రైడర్స్ ఖాతాలో రూ. 64.30 కోట్లు ఉండగా చెన్నై సూపర్ కింగ్స్ పర్స్‌లో రూ. 43.40 కోట్ల నగదు ఉంది. వేలంలో ఈ రెండు జట్ల మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. చెన్నై, బెంగళూరుతో పాటు హైదరాబాద్ (రూ. 25.50 కోట్లు), లక్నో (రూ. 22.95 కోట్లు), ఢిల్లీ (రూ. 21.80 కోట్లు), బెంగళూరు (రూ. 16.40 కోట్లు) కూడా కీలక ఆటగాళ్లపై కన్నేశాయి. మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్, ఇంగ్లండ్ స్పిన్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టొన్, భారత బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్, స్పిన్నర్ రవి బిష్ణోయ్, ఇంగ్లండ్ వికెట్‌కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ అత్యధిక ధర పలికే ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. ఐపీఎల్‌లో పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లకు ఉండే క్రేజే వేరు. గ్రీన్ కూడా ఆ క్యాటగిరీలో ఉన్నవాడే. ఆసీస్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్న అతడిని సీఎస్‌కేతో పాటు కేకేఆర్ టార్గెట్ చేశాయి. కేకేఆర్ ఆండ్రీ రసెల్ రూపంలో నిఖార్సైన పేస్ ఆల్‌రౌండర్‌ను కోల్పోగా చెన్నై కూడా జడేజా సేవలు వదులుకుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జట్లకూ గ్రీన్ అవసరం ఎంతో ఉంది. ఐపీఎల్ మొదటి సీజన్‌లో ముంబైకి, ఆ తర్వాత బెంగళూరుకు ఆడిన అతడు.. ఉన్నంతలో మెరుగైన ప్రదర్శనలే చేశాడు. ఇప్పటిదాకా ఐపీఎల్‌లో అతడు 29 మ్యాచ్‌లాడి 704 రన్స్ చేయడమే గాక 16 వికెట్లు పడగొట్టాడు. నేటివేలంలో అతడు ఆసీస్ ప్రీమియం పేసర్ మిచెల్ స్టార్క్ అత్యధిక ధర (రూ. 24.75 కోట్లు) రికార్డును దాటేస్తాడని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే నిబంధనల ప్రకారం మినీ వేలంలో ఒక విదేశీ ఆటగాడి ఫీజు సదరు ఫ్రాంచైజీ హయ్యస్ట్ రిటెన్షన్ వాల్యూ (రూ. 18 కోట్లు) కంటే మించదు.

మనుభాకర్, సిమ్రన్‌ప్రీత్‌కు స్వర్ణాలు

డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్, ఇటీవలే ముగిసిన వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో స్వర్ణం గెలిచిన సిమ్రన్‌ప్రీత్ కౌర్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పసిడి పతకాలు గెలిచారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్‌లో మను.. 36 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణాన్ని నెగ్గగా కర్నాటకకు చెందిన దివ్య రజతం గెలిచింది. ఇదే క్యాటగిరీ జూనియర్ విభాగంలో 21 ఏండ్ల సిమ్రన్‌ప్రీత్.. తన జోరును కొనసాగిస్తూ గోల్డ్ మెడల్ కొట్టింది. ఫైనల్‌లో ఆమె 39 పాయింట్లతో స్వర్ణం నెగ్గగా ప్రణవికి రజతం, పాలక్‌కు కాంస్యం దక్కాయి.

దేశవాళీ ఆడాల్సిందే

- తేల్చి చెప్పిన బీసీసీఐ

అంతర్జాతీయ మ్యాచ్‌లు లేనప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని స్పష్టం చేసిన భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ విధానాన్ని పక్కాగా అమలు చేయాలనుకుంటోంది. విరాట్ కోహ్లి , రోహిత్ శర్మ తో పాటు జట్టులోని సీనియర్లను డొమెస్టిక్‌లో ఆడాలని కోరుతోంది బీసీసీఐ. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ ముగిశాక వారానికే విజయ్ హజారే ట్రోఫీ షురూ కానుంది. వచ్చే వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్న రోకో ఈ ట్రోఫీకి అందుబాటులో ఉంటామని ఇప్పటికే తమ రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సమాచారమిచ్చారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ ఇటీవల కాలంలో వరుసగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. టెస్టు, వన్డే సారథిగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన అగార్కర్ బృందం.. టీమిండియా క్రికెటర్లు దేశవాళీలో ఆడాల్సిందేనని కొత్త మెలిక పెట్టింది. దాంతో.. పదేహేనళ్లుగా డొమెస్టిక్ టోర్నీలు ఆడని మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు సైతం 'మేము రెఢీ' అని చెప్పేశారు. రాబోయే విజయ్ హజారే ట్రోఫీ కోసం తమను ఎంపిక చేయాలని వీరు ఇప్పటికే తమ రాష్ట్ర బోర్డులకు సమాచారమిచ్చారు. వీరితో పాటు సీనియర్లను కూడా ఒక ట్రెండ్ మ్యాచ్‌లు ఆడించాలని భావిస్తున్న బీసీసీఐ ఈ విషయాన్ని అజిత్ అగార్కర్ ద్వారా వారికి చేరవేసింది. దాంతో.. బుమ్రా, సిరాజ్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్‌లను కూడా తమతమ రాష్ట్ర జట్ల తరఫున విజయ్ హజారే ట్రోఫీలో ఆడడం ఖాయమనిపిస్తోంది. డిసెంబర్ 24 నుంచి వియ్ హజారే ట్రోఫీ ప్రారంభం కానుంది.

ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

బైబై ఇండియా.. మళ్లీ వస్తా!!

సాకర్ స్టార్‌కు ఘనంగా వీడ్కోలు

అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనల్ మెస్సీ భారత పర్యటన దిగ్విజయంగా ముగిసింది. సోమవారం ముంబై నుంచి ఢిల్లీకి ఆలస్యంగా చేరుకున్న మెస్సీకి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇందిరాగాంధీ విమానాశ్రయానికి చేరుకున్న ఈ సాకర్ దిగ్గజం లీలా ప్యాలెస్ హోటల్‌లో ఎంపిక చేసిన కొద్ది మంది అతిథులతో గడిపాడు. ఆ తర్వాత అక్కణ్నుంచి అరుణ్‌జైట్లీ స్టేడియం చేరుకున్న మెస్సీతో పాటు సహచర ప్లేయర్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో ఫ్యాన్స్‌తో కలిసి సందడి చేశారు. తన భారత పర్యటనపై మెస్సీ మాట్లాడుతూ ' ఈ మూడు రోజుల్లో మీరు నాపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిది. స్వల్ప వ్యవధిలోనే మీ అందరి ప్రేమాభిమానాన్ని చూరగొనడం మరిచిపోలేనిది. మీరు మా పట్ల కనబరిచిన ప్రేమ, అప్యాయతను ఇక్కణ్నుంచి తీసుకెళుతున్నాం. ఏదో ఒక రోజు భారత్‌లో మ్యాచ్ ఆడేందుకు వస్తాం. అందరికీ కృతజ్ఞతలు' అని అన్నాడు. మెస్సీ, సువారెజ్, రోడ్రిగోకు ఐసీసీ చైర్మన్ జైషా.. టీమ్‌ఇండియా జెర్సీలు అందజేశారు. అందుకు తోడు టీమ్‌ఇండియా క్రికెటర్ల సంతకాలతో కూడిన బ్యాటును జ్ఞాపికగా బహూకరించారు. టీ20 ప్రపంచకప్ టోర్నీకి సంబంధించి మ్యాచ్ టికెట్‌ను మెస్సీకి ఇచ్చారు.



'దేఖ్‌లేంగే సాలా'

అభిమానుల ఆకలి తీర్చిన హరీష్ శంకర్

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్‌లేంగే సాలా' విడుదలై శ్రోతలను ఉర్రుతలూగిస్తోంది. కేవలం 24 గంటల్లోనే 29.6 మిలియన్లకు పైగా వీక్షణలతో రికార్డులను బద్దలు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షించి, తక్షణ హిట్ గా నిలిచింది. దేవి శ్రీ ప్రసాద్ సమకూర్చిన సంగీతం ఎంతో ఆకర్షణీయంగా ఉండి, సంగీత ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలాగే, పవన్ కళ్యాణ్ కి సరిగ్గా సరిపోయేలా దినేష్ మాస్టర్ సమకూర్చిన నృత్యరీతులు కూడా భారీ ప్రశంసలను అందుకుంటున్నాయి. ఇక ప్రేరణాత్మకమైన, వాణిజ్యపరమైన అంశాల కలయికలో భాస్కరభట్ల రాసిన సాహిత్యం పాట విజయంలో కీలక పాత్ర పోషించింది. 'దేఖ్‌లేంగే సాలా' పాట ఇంతటి విజయం సాధించడానికి ప్రధాన కారణం దర్శకుడు హరీష్ శంకర్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. సంగీతం విషయంలో ఆయనకు మంచి అభిరుచి ఉంది. హరీష్ శంకర్ గత చిత్రాలలోని పాటలు వింటే ఆ విషయం స్పష్టమవుతుంది. ముఖ్యంగా 'గబ్బర్ సింగ్' చిత్రంలోని పాటలు ఎంతటి ఆదరణ పొందాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. ఇప్పటికీ ఆ పాటలు మారు మోగుతూనే ఉంటాయి. పవన్ కళ్యాణ్ ని మళ్ళీ ఆ తరహా పాటలలో, ఆ తరహా నృత్యంతో చూడాలని కోరుకునే అభిమానులు ఎందరో ఉన్నారు. వారి కోరికను నెరవేర్చడానికి 'దేఖ్‌లేంగే సాలా' పాటకు శ్రీకారం చుట్టారు హరీష్ శంకర్. ఆయన కృషి ఫలితంగానే ఈ పాట అభిమానులకు విందు భోజనంలా మారి, ఇంతటి ఆదరణ పొందుతోంది.

కష్టాల్లో సెకండ్ ఇన్నింగ్స్

హీరోయిన్లు అందరికీ సిల్వర్ స్క్రీన్ పై సెకండ్ ఇన్నింగ్స్ పెద్దగా వర్కవుట్ కాదు. ఒకవేళ మళ్లీ స్క్రీన్ పై కనిపించాలనుకున్నా, బిజీగా మారాలనుకున్నా సపోర్టింగ్ రోల్స్ తోనే సరిపెట్టుకోవాలి తప్పించి మళ్లీ ఒకప్పటిలా హీరోయిన్ పాత్రలే అంటే ఆ అవకాశం రాదు. కానీ చాలామంది మాత్రం రీఎంట్రీ టైమ్ లో కూడా హీరోయిన్ పాత్రలపైనే ఎక్కువ ఫోకస్ చేస్తుంటారు. అయితే ఎంత ఫోకస్ చేసినా వారికి అవకాశాలు తగ్గడమనేది మామూలే. ఒకప్పుడున్న క్రేజ్ ఇప్పుడు రావాలంటే రాదు. ఒకసారి గ్యాప్ వచ్చిందంటే ఆ గ్యాప్ అలానే ఉండిపోతుంది తప్పించి ఆ గ్యాప్ తగ్గిపోయి మళ్లీ బిజీ అవడం చాలా తక్కువ మంది విషయంలోనే జరుగుతుంది. ఇక అసలు విషయానికొస్తే టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ ఒకప్పుడు ఏ స్థాయి స్టార్‌డమ్ ను అందుకున్నారో తెలిసిందే. అనుకోకుండా కెరీర్లో గ్యాప్ తీసుకున్న కాజల్ పెళ్లి, ప్రెగ్నెన్సీ కారణంతో సిల్వర్ స్క్రీన్ నుంచి కెరీర్లో కాస్త గ్యాప్ తీసుకున్న కాజల్ కు అప్పటికే ఫామ్ తగ్గడంతో రీఎంట్రీ తర్వాత కూడా పెద్దగా అవకాశాలు రాలేదు. ఫలితంగా గత కొన్నేళ్లలో కాజల్ కెరీర్లో ఒక్క సాలిడ్ హిట్ కూడా లేదు. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కాజల్ అగర్వాల్ కెరీర్ కష్టాల్లో పడిపోయింది. సీనియర్ హీరోలతో సినిమాలు చేసినా అమ్మడికి మంచి ఆఫర్లు రాలేదు. ప్రస్తుతం బాలీవుడ్ లో నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామాయణలో మండోదరి పాత్రలో నటిస్తున్న కాజల్ అగర్వాల్, ఇప్పుడు విశాఖ అనే వెబ్‌సిరీస్ లో ముగ్గురు పిల్లల తల్లి పాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. హీరోయిన్ గా సరైన అవకాశాలు రాకనే సెకండ్ ఇన్నింగ్స్ లో కాజల్ ఇలాంటి సపోర్టింగ్ రోల్స్ తో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. మరి ఇలాగైనా కాజల్ బిజీగా మారుతారేమో చూడాలి.

ఫిబ్రవరి 13న 'ఫంకీ'

వాలెంటైన్స్ వీకెండ్‌కు ఫుల్ ఫన్ గ్యారంటీ!

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా థియేటర్లలో 'ఫంకీ' చిత్రం సందడి మొదలు కానుంది. అపరిమితమైన వినోదాన్ని అందించనున్న ఈ సినిమాను 2026 ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. తొలుత 'ఫంకీ' చిత్రాన్ని 2026 ఏప్రిల్ లో విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. ఇప్పుడు విడుదల తేదీ ముందుకు జరగడంతో.. కాస్త ముందుగానే ప్రేక్షకులు ఈ వినోదాల విందుని ఆస్వాదించనున్నారు. నవ్వులు, గందరగోళం, స్వచ్ఛమైన వినోదానికి పేరుగాంచిన అద్భుతమైన కలయికలో ఫంకీ రూపొందుతోంది. దర్శకుడు కె.వి. అనుదీప్ తన శైలి కామెడీ విందుతో తిరిగి వచ్చారు. ఈసారి రెట్టింపు నవ్వులతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. అనుదీప్ దర్శకత్వం అంటే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. 'జాతిరత్నాలు' సినిమాతో సంచలనాలు సృష్టించిన ఆయన.. మరోసారి విభిన్నమైన కథాంశం, కట్టిపడేసే హాస్యంతో ప్రేక్షకుల మనసు దోచుకోనున్నారు. 'ఫంకీ' చిత్రంలో విశ్వక్ సేన్ సినీ దర్శకుడి పాత్రను పోషిస్తుండటం విశేషం. కొత్త లుక్, కొత్త యాటిట్యూడ్‌తో ప్రేక్షకులను సరికొత్తగా అలరించనున్నారు. ఇప్పటికే టీజర్‌లో ఆయన నటన, ఎనర్జీ, కామెడీ టైమింగ్ కి ప్రశంసల వర్షం కురిసింది. ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయమవుతున్న కథానాయిక కయాదు లోహర్ తన అందంతో అందరి దృష్టిని ఆకర్షించారు. తెరపై విశ్వక్‌కయాదు జోడి కొత్తగా, అందంగా కనిపిస్తూ.. ఇప్పటికే యువత మనసులలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది.

మంచి అనుభూతితో థియేటర్ నుంచి బయటకు వస్తారు

- 'దండోరా' దర్శకుడు మురళీకాంత్

వైవిధ్యమైన చిత్రం కలర్ ఫొటో, బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందించిన తాజా చిత్రం 'దండోరా'. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ సినిమాను మురళీకాంత్ తెరకెక్కించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న భారీ ఎత్తున విడుదల కాబోతోంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా దర్శకుడు మురళీకాంత్ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన చిత్ర విశేషాలివే..

'దండోరా' కథ ఆలోచన ఎక్కడ, ఎలా మొదలైంది?

మాది మెదక్. నాకు ఓ మంచి సినిమాను తీయాలనే కోరిక ఉండేది. అమెరికాలో జాబ్ చేస్తుండేవాడిని. కానీ నాకు అది రొటీన్ లైఫ్ అని అనిపించింది. నేను అక్కడ కూడా ఎక్కువగా సినిమాలు చూస్తుండేవాడిని. అలా సినిమాల మీద ఇష్టంతో జీవితంలో రిస్క్ తీసుకుని ఇటు వైపు వచ్చాను. నా మెదడులో చాలా కథలు ఉన్నాయి. అయితే ప్రేమ కథల్ని నెరేట్ చేయడం చాలా కష్టం. అందుకే ఓ కాన్సెప్ట్, మూలాల్లోని కథ చెప్పాలని ఈ స్టోరీ అనుకున్నాను. పుస్తకాలు చదవడం ద్వారా ఎంతో మంది, ఎన్నో రకాల లైఫ్ స్టైల్స్ తెలుస్తాయి. సమాజంలోని అసమానతల మీద కథ చెప్పాలనే ఉద్దేశంతో 'దండోరా' తీశాను.

'దండోరా' కథ కోసం ఎలాంటి రీసెర్చ్ చేశారు?

చనిపోయిన వ్యక్తుల్ని పూడ్చేందుకు కమ్యూనిటీ వైజ్‌గా, రిలీజియస్ వైజ్‌గా కొంత మందికి భూమిని కేటాయిస్తారని నాకు అంతగా తెలీదు. నాకు ఎదురైన ఓ అనుభవంతో ఈ కథను రాసుకున్నాను. మలయాళంలో ఎక్కువగా కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తాయని అంటుంటారు. మన దగ్గర ఎందుకు రావు? అనే ఆలోచనల్లోంచి ఈ కథను రాసుకున్నాను.

'బలగం' కూడా చనిపోయిన వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. 'దండోరా'తో పోలికలు ఏమైనా వస్తాయా?

'బలగం'లో వ్యక్తి చనిపోయిన తరువాత జరిగే పిండ ప్రధానం చుట్టూ తిరుగుతుంది. 'దండోరా' చిత్రంలో వ్యక్తి చనిపోయిన తరువాత నుంచి పూడ్చి పెట్టే వరకు జరుగుతుంది. క్రిమేషన్‌తో ఈ చిత్రం ఎండ్ కార్డ్ పడుతుంది. 'బలగం' కథకి, 'దండోరా'కి ఎలాంటి పోలికలు, స్ఫూర్తి గానీ లేదు. ఓ వ్యక్తిని ఎందుకు పూడ్చనివ్వడం లేదు? ఆ ఊరి సమస్య ఏంటి? సమస్యకు పరిష్కారం దొరికిందా? లేదా? అన్నదే కథ.

'దండోరా'లో ప్రధాన పాత్ర ఎవరిది?

'దండోరా'లో ప్రతీ పాత్రకు ఇంపార్టెన్స్ ఉంటుంది. అన్ని పాత్రలు శివాజీ గారి కారెక్టర్‌కు లింక్ అయి ఉంటుంది. కానీ ఇందులోని ప్రతీ కారెక్టర్‌కి స్కోప్ ఉంటుంది. బిందు మాధవి గారి పాత్ర అయితే చాలా సర్ ప్రైజింగ్‌గా ఉంటుంది. వెరీ స్ట్రాంగ్ ఉమెన్‌గా ఆమె పాత్ర ఉంటుంది. నా ఈ చిత్రంలో నిర్ణయాలన్నీ మహిళ పాత్రలే తీసుకుంటాయి.

వైకుంఠధామాల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది కదా?.. ఈ చిత్రంలో ఆ పాయింట్ టచ్ చేశారా?

ప్రభుత్వాలు వైకుంఠ ధామాల్ని ఏర్పాటు చేసింది. కానీ అక్కడ కూడా వివక్షనే చూపిస్తుంటారు. నేను ప్రత్యక్షంగా ఎన్నో ఘటనల్ని చూశాను. అందుకే ఈ కథను రాసుకున్నాను. అయితే ఈ సమస్యకు నేను పూర్తిగా పరిష్కారాన్ని ఇచ్చానా? చూపించానా? అన్నది సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులే చెప్పాలి.

'దండోరా' విషయంలో నిర్మాతల సహకారం గురించి చెప్పండి?

'దండోరా' కథ రాసుకున్న తరువాత నాకు సంతృప్తిగా అనిపించింది. అయితే ఈ కథను చాలా మంది నిర్మాతలకు పంపాను. కానీ నిర్మాతల అభిరుచికి తగ్గట్టుగా మన కథను పంపాలని తర్వాత తెలుసుకున్నాను. అలా రవీంద్ర గారికి కథ పంపాను. నేను చెప్పిన కథ ఆయనకు వెంటనే నచ్చింది. తక్కువ బడ్జెట్ లో చేద్దామని నేను చెప్పాను. కానీ మంచి క్వాలిటీతో, భారీ ఎత్తున తీయాల్సిందే అని రవీంద్ర గారే ముందుండి నడిపించారు. ఈ ప్రయాణంలో మా ఇద్దరి మధ్య ఎన్నో క్రియేటివ్ డిస్కషన్స్ వచ్చాయి. సినిమా చూసిన తరువాత రవీంద్ర గారు హ్యాపీగా ఫీల్ అయ్యారు.

'దండోరా' వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?

నేను ఇంత వరకు ఎవ్వరి దగ్గరా ఏడీగా పని చేయలేదు. ఒకేసారి సెట్ లో వంద, రెండొందల మందిని చూసే సరికి భయపడ్డాను. మొదటి రెండు రోజులు చాలా ఇబ్బంది పడ్డాను. కానీ ఆ తరువాత సెట్ అయ్యాను. నేను రెండు, మూడు రోజుల్లో తీసిన అవుట్ పుట్ చూసి అందరూ మెచ్చుకున్నారు. అలా ఫస్ట్ షెడ్యూల్‌లోనే 18 రోజులు షూట్ చేశాం.

'దండోరా' టైటిల్ గురించి చెప్పండి?

ముందుగా ఈ మూవీ కోసం వేరే టైటిల్ అనుకున్నాను. ఇది నాకు మూడేళ్ల జర్నీ. 'అంతిమ యాత్ర' అనే వర్కింగ్ టైటిల్‌ను అందరూ చూసి డల్‌గా ఉందని అనుకున్నారు. మనం మంచి కథను, మంచి సౌండింగ్‌తో చెబుతున్నాం కదా.. టైటిల్ కూడా అంతే పవర్ ఫుల్‌గా ఉండాలని నిర్మాత అన్నారు. అలాంటి టైంలో ఓ ఫ్రెండ్ 'దండోరా' అని సలహా ఇచ్చారు. అలా ఈ మూవీకి కరెక్ట్ టైటిల్ దొరికినట్టు అయింది.

'దండోరా' నుంచి ఆడియెన్స్ ఏం ఆశించి థియేటర్‌కు రావాలి? 'దండోరా'లో ఏం ఉండబోతోంది?

'దండోరా' టైటిల్ వినగానే అందరి మైండ్‌లో ఎన్నో ఊహాగానాలు వచ్చి ఉంటాయి. కథ అలా ఉంటుందా? ఇలా ఉంటుందా? ఈ పాయింట్ చెబుతున్నాడా? అని ఇలా పది అంశాల్ని ఊహిస్తారు. కానీ సినిమా చూసిన తరువాత ప్రతీ ఒక్కరూ సర్ ప్రైజ్ అవుతారు. మార్క్ కె రాబిన్ గారి మ్యూజిక్, ఆర్ఆర్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ చిత్రంలో ఆర్ఆర్ అందరినీ కదిలిస్తుంది. 'దండోరా' చిత్రం, అందులోని స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటుంది. ఓ అందమైన అనుభూతితో థియేటర్ నుంచి బయటకు వస్తారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200